http://www.agnidharanews.com
# అగ్నిధార
ఆదివారం 6 ఏప్రిల్ 2025
నిజాల నిప్పు కణిక
ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్
పేజీలు : 5 వెల : 5/-
Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

# విస్తరణ... ఇంకా ఉంది



- తెలంగాణ మంత్రివర్గ విస్తరణ మళ్లీ వాయిదా
- డైలీ సిరియల్ లా మంత్రివర్గ విస్తరణ
- కొత్త మంత్రుల ఎంపిక విషయంలో అనూహ్య పరిణామాలు
- ఈ నెల 3న విస్తరణ జరుగుతుందని అందరూ ఊహించినప్పటికీ, చివరి నిమిషంలో తెరపైకి ఢిల్లీ నుంచి కొత్త ట్విస్ట్‌లు
- మంత్రుల జాబితా ఖరారైనట్లు పార్టీ ముఖ్య నేతలు భావించినా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కొన్ని పేర్లపై అభ్యంతరం

హైదరాబాద్

ఈసారి కచ్చితంగా జరుగుతుంది అనుకున్న తెలంగాణ మంత్రివర్గ విస్తరణ మళ్లీ వాయిదా పడిపోయింది.. డైలీ సిరియల్ లా వ్యవహారంనడుస్తోంవది. కొత్త మంత్రుల ఎంపిక విషయంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 3న విస్తరణ జరుగుతుందని అందరూ ఊహించినప్పటికీ, చివరి నిమిషంలో ఢిల్లీ నుంచి కొత్త ట్విస్ట్‌లు తెరపైకి వచ్చాయి. మంత్రుల జాబితా ఖరారైనట్లు పార్టీ ముఖ్య నేతలు భావించినా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కొన్ని పేర్లపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో పరిస్థితి మారింది. దీంతో, కొత్త జాబితా కోసం పార్టీ నేతలు మళ్లీ కసరత్తు ప్రారంభించారు, మరో ఇద్దరి పేర్లు చర్చలోకి వచ్చాయి.రాష్ట్ర కేబినెట్‌లో ఆరు స్థానాలు ఖాళీగా ఉండగా, సామాజిక, ప్రాంతీయ సమీకరణల ఆధారంగా నలుగురిని ఎంపిక చేసేందుకు గత నెలలో ఢిల్లీ(లో నిర్ణయం జరిగింది. ఉగాది సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌తో సమావేశంలో కూడా విస్తరణ గురించి సూచనలు ఇచ్చారు. కానీ, రాహుల్ గాంధీ కొమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇప్పటికే కొమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రిగా ఉండగా, ఆయన సోదరుడికి మరోసారి అవకాశం ఇవ్వడం ఎందుకని రాహుల్ ఆరా తీశారు. అయితే, రాజగోపాల్‌కు పార్టీలో చేరినప్పుడే మంత్రి పదవి హామీ ఇచ్చామని నేతలు వివరించినప్పటికీ, తుది నిర్ణయం కోసం వేచి చూడాలని రాహుల్ సూచించినట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే.. సీనియర్ నేత జానారెడ్డి హైకమాండ్‌కు రాసిన లేఖ సంచలనంగా మారింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదని, - మిగతా3లో



# మైనార్టీలపై తమది కపట ప్రేమే

- 30 కోట్ల మంది మైనార్టీల పట్ల తమది కపట ప్రేమేనని నిరూపించుకున్న ఎన్నికల గాంధీలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్

దేశంలోని 30 కోట్ల మంది మైనార్టీలపై తమది కపట ప్రేమేనని ఎన్నికల గాంధీలు నిరూపించుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. శనివారం తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడారు. అత్యంత కీలకమైన వక్ఫ్ చట్టసవరణ బిల్లుపై లోక్ సభలో చర్చ సందర్భంగా మాట్లాడకుండా ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఖామోష్ అయ్యారని.. ప్రియాంకా గాంధీ అసలే సభకే హాజరు కాకుండా డుమ్మా కొట్టారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ వక్ఫ్ బిల్లు సందర్భంగా లోక్ సభలో వెన్ను చూపారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలిద్దరికీ - మిగతా3లో

# హెచ్‌సీయూ విషయంలో అబద్ధపు ప్రచారాలు

- బాధ్యులపై కేసులు నమోదు చేయండి
- పునరావృతం కాకుండా చర్యలు తీసుకోండి
- ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు



హైదరాబాద్

యూనివర్సిటీ భూములను లాక్కున్నట్లుగా సోషల్ మీడియా నెట్ వర్క్ కృత్రిమంగా వివాదం సృష్టించటం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది.కంచె గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.కంచె గచ్చిబౌలి లోని సర్వే నెంబర్ 25లో ఉన్న భూముల్లో గత 25 ఏండ్లుగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్ బీ తో పాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రైవేటు బిల్డింగ్ లు, రెసిడెన్షియల్ అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ బిల్డింగ్ లను నిర్మించారు. వాటిని నిర్మించేటప్పుడు ఎలాంటి వివాదాలు, ఆందోళనలు జరగలేదని అధికారులు ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకు వచ్చారు. అప్పుడు వన్యప్రాణుల - మిగతా3లో

# ఎంఐఎం కోటలు బద్దలు కొడతాం






- తమకు సంఖ్యా బలం లేదని అందరూ అంటున్నారు
- కానీ అభివృద్ధిని కాంక్షిచే వారు బీజేపీకే ఓటు వేయబోతున్నారు
- ఇక అధికారంలో ఎవరు ఉన్నా మజ్లిస్‌కు హైదరాబాద్ రాసి ఇవ్వడం అలవాటుగా మారింది

హైదరాబాద్

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు తమదే అని రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం కిషన్ రెడ్డి మాట్లాడుతూ... తమకు సంఖ్యా బలం లేదని అందరూ అంటున్నారని.. కానీ అభివృద్ధిని కాంక్షిచే వారు బీజేపీకే ఓటు వేయబోతున్నారని చెప్పారు. ఇక అధికారంలో ఎవరు ఉన్నా మజ్లిస్‌కు హైదరాబాద్ రాసి ఇవ్వడం అలవాటుగా మారిందన్నారు. అందులో భాగంగానే ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఎవరు ఉంటే వాళ్లతో - మిగతా3లో

# తాను దంతేశ్వరి మాత ఆశీస్సులు పొందా

- మావోయిస్టులకు అమిత్ షా సవాల్
- వచ్చే నవరాత్రి నాటికి ఎర్ర బీభత్సం అంతం కావాలన్నారు.
- ప్రపంచానికి చాటి చెప్పే పాండుం ముగింపు కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది
- మోదీ నుంచి తానొక సందేశం తెచ్చా.. వచ్చే ఏడాది దేశంలోని ప్రతీ గిరిజన జిల్లా నుంచి కళాకారులను ఒకే పేరుతో బస్తర్ పాండుం ఉత్సవాలకు తీసుకొస్తాం"



అగ్నిధార

# బెంగాల్‌లో రామనవమి ఊరేగింపునకు కోర్టు గ్రీన్‌సిగ్నల్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో శ్రీరామ నవమి ఊరేగింపులకు అవాంతరం తొలిగిపోయింది. రామనవమి ఊరేగింపులు నిర్వహించుకునేందుకు హిందూ సంస్థలకు కోల్‌కతా హైకోర్టు అనుమతి ఇచ్చింది. గత ఏడాది శ్రీరామనవమి వేడుకల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడంతో ఈ ఏడాది ఊరేగింపులకు అనుమతి ఇవ్వరాదని బెంగాల్ పోలీసులు నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని హైకోర్టు తోసిపుచ్చింది. కొన్ని షరతులతో హౌరాలో రామనవమి ఊరేగింపులు నిర్వహించుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఊరేగింపులో పాల్గొనే వారు ఎలాంటి ఆయుధాలు కానీ, కర్రలు కానీ కలిగి ఉండరాదని, వారి సంఖ్య 500కు పరిమితం చేయాలని, డీజేలు అనుమతించరాదని, ఊరేగింపు వెళ్లే రూట్‌ను కచ్చితంగా పాటించాలని, ఊరేగింపులో పాల్గొనే వారు ఐడీ కార్డు ప్రతిని పోలీసులకు అందచేయాలని కోర్టు షరతులు విధించింది. రామనవమి ఊరేగింపునకు అనుమతించాలని హౌరా జిల్లా పోలీసులను హిందూ సంస్థలు కోరాయి. అయితే 2023, 2024లో రామనవమి ఊరేగింపు సందర్భంగా హింసాత్మక ఘటనలు, రాళ్లు రువ్వుడు ఘటనలు చోటుచేసుకున్నందున అనుమతి ఇవ్వలేమని పోలీసులు



నిరాకరించారు. ఈ నిర్ణయాన్ని అంజని పుత్ర సేన, విశ్వహిందూ పరిషత్ వంటి హిందూ సంస్థలు హైకోర్టులో సవాలు చేశాయి. అయితే కోర్టు నిర్ణయం హిందూ సంస్థలకు అనుకూలంగా వచ్చింది.

# ఇంటి రూఫ్‌పై రెండు కుటుంబాలు ఘర్షణ.. తర్వాత ఏం జరిగిందంటే?

ముంబై: రెండు కుటుంబాలకు చెందిన వారు ఇంటి రూఫ్‌పై ఘర్షణ పడ్డారు. ఉన్నట్టుండి ఆ రూఫ్ కూలిపోయింది. దీంతో సుమారు పది మంది కూలిన రూఫ్‌తో పాటు కిందపడ్డారు. అయితే ఎవరూ పెద్దగా గాయపడలేదు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భివాండిలోని దేనేనగర్‌లో రెండు కుటుంబాల మధ్య వాగ్వాదం జరిగింది. ఫోన్ కాల్‌లో మాటల దూషణపై మొయినుద్దీన్ నస్రుద్దీన్ షేక్, నస్రుద్దీన్ ఇమాముద్దీన్ షేక్ కుటుంబాల మధ్య గొడవ జరిగింది. వాగ్వాదం ముదరడంతో వారి మధ్య ఘర్షణకు దారి తీసింది. కాగా, ఇరు కుటుంబాలకు చెందిన సుమారు పది మంది తోసుకుని కొట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ ఘర్షణలో ఆ రూఫ్ ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో వారంతా కింద ఉన్న గదిలో పడిపోయారు. అయితే అదృష్టవశాత్తూ ఎవరికీ తీవ్ర గాయాలు కాలేదు. ఆ ఇల్లు మాత్రం ధ్వంసమైంది. దీంతో ఇంటి యజమానికి నష్ట పరిహారం చెల్లించేందుకు ఆ రెండు కుటుంబాలు అంగీకరించాయి. ఆ తర్వాత ఘర్షణపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. మరోవైపు కోట్లాట సందర్భంగా వారున్న రూఫ్ కూలిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.





# ఓల్డ్ ఏజ్ హోమ్‌కు పంపుతావా.. లేదా.. ? భర్తపై భార్య దాడి

**గ్వాలియర్:** ఇది భార్య భర్తల మధ్య చోటు చేసుకున్న రగడ. అత్తను ఓల్డ్ ఏజ్ హోమ్ లో జాయిన్ చేయమని డిమాండ్ చేస్తోంది కోడలు. అందుకు కొడుకు ఒప్పుకోవడం లేదు. అమ్మను ఓల్డ్ ఏజ్ హోమ్ లో జాయిన్ చేయడమేంటని పట్టుపట్టుకుని కూర్చున్నాడు. ఇక్కడ ఎవరు చెప్పినా వినే ప్రసక్తే లేదని భార్యకు తేల్చిచెప్పాడు. ఇది గత కొన్ని నెలలుగా వీరిద్దరి మధ్య చోటు చేసుకున్న సంఘర్షణ. ఇది కాస్తా వివాదానికి దారి తీసింది. తన మాట విననందుకు కుటుంబ సభ్యుల్ని పిలిపించింది భార్య. ఈ విషయంలో భర్తతో అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమైంది. ఈ క్రమంలోనే కుటుంబ సభ్యులతో ఆమె భర్త గొడవపడ్డాడు.. అయితే భర్తపై భార్య తరపు బంధువులు దాడికి దిగారు. తన కొడుకును ఒక్కడిని చేసి దాడి చేస్తున్నారని తల్లి పరుగెత్తుకొచ్చింది. కొడుకును రక్షించాలని తాపత్రాయపడింది. మరి కోడలు ఊరుకుంటుందా.. అత్తను జుట్టు పట్టుకుని కిందకు పడేసింది. పడిపోయిన అత్తపై మళ్లీ మళ్లీ దాడి చేసింది సదరు కోడలు. వివరాల్లోకి వెళితే.. గ్వాలియర్ కు చెందిన విశాల్ బత్రా, నీలిక భార్యా భర్తలు. వీరితో కలిసి విశాల్ తల్లి ఉంటోంది. 70 ఏళ్లు పైబడ్డ వయసులో కొడుకును ఆశ్రయించింది. తన తల్లిని చూసుకోవాలనే బాధ్యతను గ్రహించిన విశాల్.. తల్లిని తన ఇంట్లోనే పెట్టుకున్నాడు. అయితే కోడలు ఊరుకోలేదు. ఎంతకాలం ఈ ముసలామెను ఇంట్లో ఉంచుతావంటూ భర్తతో పదే పదే గొడవ పడేది. ఇలా ఏడాదికి పైగానే గడిచింది. ఎంతకాలమైనా తన వద్దే తల్లి ఉంటుందని భర్త తెగేసి చెప్పాడు. దాంతో ఆగ్రహించిన భార్య.. తన బంధువుల్ని గొడవకు పురామాయించింది. ఎలాగైనా సరే అత్తను ఇంట్లో నుంచి పంపించాలని భీష్మించుకుని కూర్చొంది. విశాల్ ఇంటికి వచ్చిన 'పెద్దలు'( భార్య తరప/



బంధువులు) అతనిపై దాడికి పూనుకున్నారు. ఇద్దరు వ్యక్తులు కలిసి విశాల్ పై దాడికి దిగారు. దీన్ని చూసిన విశాల్ తల్లి దాన్ని ఆపడానికి యత్నించింది. ఇక్కడ కోడలు అమాంతం అత్త మీదకు దూకి ఆ పెద్దామెను జుట్టు పట్టుకుని ఈడ్చేసింది. ఈ క్రమంలోనే ఆమె కిందపడిపోయినా మళ్లీ మళ్లీ దాడి చేసింది. ఈ ఘటనను ఇండియన్ ప్రైవేట్ న్యూస్ ఏజెన్సీ ఐఏఎన్ఎస్ తో సహా పలు జాతీయ చానళ్లు వెలుగులోకి తెచ్చాయి.

**నా భార్య వేధిస్తోంది.. చివరకు దాడి చేసింది..**

దీనిపై ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ కు వెళ్లిన విశాల్.. బయట మీడియాతో మాట్లాడారు. ' నేను నా ఇంటిలో దాడికి గురయ్యాను. సుమారు 10 నుంచి 15 మంది వరకూ నా ఇంటికి వచ్చి నన్ను, మా అమ్మపై దాడి చేశారు. నా తల్లిని బయటకు పంపేయమని నా భార్య వేధిస్తోంది. దీన్ని నేను కాదనడంతో నాపై దాడికి చేయించింది. నీలిక సోదరుడు, తండ్రి కలిసి మమ్మల్ని దారుణంగా కొట్టారు. ఈ విషయంలో భార్య నీలిక నన్ను రోజూ తీవ్రంగా తిడుతూ ఉంటోంది. ఈ విషయంలో న్యాయం చేయాలని కోరుతూ ఎస్పీ ఆఫీస్ కు వచ్చాను' అని విశాల్ తెలిపాడు.

# కూలిన నాలుగు షాపులు.. శిథిలాల కింద చిక్కుకున్న కొందరు

**లక్నో:** నాలుగు షాపులు కూలిపోయాయి. ఈ సంఘటనలో పలువురు వ్యక్తులు శిథిలాల కింద చిక్కుకున్నారు. పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఐదుగురిని రక్షించారు. శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈ సంఘటన జరిగింది. సికంద్రా ప్రాంతంలో హౌసింగ్ డెవలప్‌మెంట్ (ఆవాస్ వికాస్) డిపార్ట్‌మెంట్ నిర్మించిన షాపులను పునరుద్ధరిస్తున్నారు. అయితే శనివారం ఈ పనులు చేస్తుండగా నాలుగు షాపులు కూలిపోయాయి. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏడుగురు వ్యక్తులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలుసుకున్నారు. జేసీబీలతో సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల నుంచి ఐదుగురిని కాపాడారు. మరో ఇద్దరు వ్యక్తులను కూడా శిథిలాల నుంచి బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ముందు జాగ్రత్త కోసం అంబులెన్స్‌లను అక్కడకు రప్పించారు.



## తాను దంతేశ్వరి మాత ఆశీస్సులు పొందా

**ఛత్తీస్‌గఢ్:** దంతేవాడ జిల్లాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటించారు. దంతేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పాండుం ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ తాను దంతేశ్వరి మాత ఆశీస్సులు పొందానని.. వచ్చే నవరాత్రి నాటికి ఎర్ర బీభత్సం అంతం కావాలన్నారు. బస్తర్ గొప్ప గిరిజన సంస్కృతిని దేశానికి, ప్రపంచానికి చాటి చెప్పే పాండుం ముగింపు కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అమిత్ షా అన్నారు. ఇదే వేదికపై నుంచి మావోయిస్టులకు ఆయన గట్టి సవాలు విసిరారు. బస్తర్ గిరిజనుల అభివృద్ధిని మావోయిస్టులు ఆపలేరన్నారు. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు అమిత్‌షా పిలుపునిచ్చారు. మోదీ నుంచి తానొక సందేశం తెచ్చా.. వచ్చే ఏడాది దేశంలోని ప్రతీ గిరిజన జిల్లా నుంచి కళాకారులను ఒకే పేరుతో బస్తర్ పాండుం ఉత్సవాలకు తీసుకొస్తాం" అని అమిత్ షా ప్రకటించారు. బస్తర్ పాండుంకు అంతర్జాతీయ హోదా ఇవ్వడానికి బీజేపీ ప్రభుత్వం ప్రపంచం నలుమూలల నుంచి రాయబారులను బస్తర్‌కు తీసుకువస్తుందంటూ ఆయన చెప్పుకొచ్చారు.

## ఆ టీచర్ల కుటుంబాల్లో అంతా కన్నీటి వరదే






ఇది ఏ ఒక్కరి పరిస్థితో కాదు.. సుమారు 25 వేల మందికిపైగా ఉద్యోగస్తుల పరిస్థితి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇదే టాపిక్. 2016 టీచర్ల నియమాకాల రద్దు టాపిక్.. ప్రస్తుతం హాట్ టాపిక్ అయ్యింది. ఎంతో హాయిగా తమ జీవితాల్లోకి వెలుగొచ్చిందని అనుకుంటుండగానే వారి జీవితాల్లో చీకటి అలుముకుంది. టీచర్లగా ఉద్యోగాలు చేస్తూ సంఘంలో ఎంతో గౌరవంగా బతుకుతున్న వారి జీవితాలను కారు మబ్బు అలుముకుంది. తమ నియామకాలు చెల్లవని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో టీచర్ల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. దేశ అత్యున్నత ధర్మాసనం తీర్పు ఇలా ఉంటే ఇక ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆ టీచర్ల కుటుంబాల్లో కన్నీటి వరదలే తారసపడుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 2016 నుంచి పనిచేస్తున్న 25 వేల మంది ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేస్తూ రెండు రోజుల క్రితం తీర్పు ఇవ్వడంపై ఆ టీచర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. టీచర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్ నియమాకాలు కలిపి 25 వేల 753 పోస్టులను చెల్లవంటూ సుప్రీంకోర్టు నుంచి తీర్పు వచ్చిన నేపథ్యంలో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక తమ జీవితాలు ఇంతేనా.. అంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎందుకిలా జరిగింది.. మాకే ఎందుకు ఇలా జరిగింది అంటూ మౌనంగా రోదిస్తున్నారు. 2016లో టీచర్ గా నియమించబడ్డ రజత్ హల్దార్ మాట్లాడుతూ.. ' మాకు మాటలు రావడం లేదు. మేము అర్హత సాధించిన టీచర్లం. మాకు ఎటువంటి ఆరోపణలు లేవు. సుమారు 19 వేల మంది టీచింగ్ స్టాఫ్ పై ఎటువంటి అభ్యంతరాలు లేవు. కానీ మమ్మల్ని వారు అనర్హులు అంటూ సుప్రీంకోర్టు ప్రకటించడంతో మాకు ఏమీ చెప్పుకోవాలో.. ఎవరి చెప్పుకోవాలో తెలయని స్థితిలో ఉన్నాం. సుప్రీంకోర్టు తీర్పుతో మాకు అన్యాయం జరిగింది. ఇది న్యాయబద్ధమైన తీర్పు కాదు. ఏ దర్యాప్తు సంస్థలు కూడా మా నియామకం చట్టబద్ధతలో జరగలేదని చెప్పలేదు. మేము ఎటువంటి తప్పు చేయలేదు' అంటూ గద్గద స్వరంతో చెప్పుకొచ్చాడు. కాగా, వెస్ట్ బెంగాల్‌లో 2016 నుంచి పనిచేస్తున్న 25 వేల మంది ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు 2024లో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. నియామకాల్లో భారీ అక్రమాలు, అవకతవకలకు పాల్పడిన పశ్చిమబెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్(డబ్ల్యూబీఎస్ఎస్‌సీ)కు అత్యున్నత న్యాయస్థానం తలంటింది. మొత్తం 25,753 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకాల్లో అవకతవకలను, లోపాలను ఉద్దేశపూర్వకంగానే కప్పిపుచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ..మొత్తం నియామకాలు చెల్లవని తీర్పు వెలువరించింది. మళ్లీ నియామకాలు చేపట్టాలని మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం గురువారం ఆదేశించింది. మరికొద్ది నెలల్లో అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండగా చోటుచేసుకున్న ఈ పరిణామం మమతా సర్కారు గట్టి ఎదురుదెబ్బగా విశ్లేషకులు చెబుతున్నారు.

## మద్యం మత్తు కాదు.. ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టులో షాకింగ్ విషయాలు





**గాంధీనగర్:** వడోదరా కారు ప్రమాదం కేసులో విస్తుపోయే విషయం ఒకటి వెలుగు చూసింది. ఈ కేసులో నిందితుడు రక్షిత్ చౌరాసియా తానేం మద్యం సేవించి బండి నడపలేదంటూ మొదటి నుంచి వాదిస్తున్నాడు. అయితే.. తాజాగా తేలింది ఏంటంటే అతను, అతని స్నేహితులు గంజాయి తీసుకుని కారు నడిపారని!. మార్చి 13వ తేదీన హోలీనాడు వడోదరా కరేలీబాగ్‌లోని ఆమ్రపాలి చౌరస్తాలో ఘోరం చోటు చేసుకుంది. 23 ఏళ్ల న్యాయ విద్యార్థి రక్షిత్ చౌరాసియా తన ఇద్దరు స్నేహితులతో కలిసి కారు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ పలు వాహనాలకు మీదకు దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మరణించగా.. మరో ఏడుగురుకి గాయాలయ్యాయి. ఈ ఘటన అక్కడ ఉన్న కెమెరాల్లో రికార్డయ్యింది. అంతేకాదు.. ఘటన తర్వాత కూడా చౌరాసియా ఏదో మత్తులో జోగుతూ "ఇంకో రౌండ్.. ఇంకో రౌండ్.. ఓం నమఃశివాయ" అంటూ మాట్లాడిన మాటలు కూడా వైరల్ అయ్యాయి. దీంతో అతను మద్యం సేవించి బండి నడిపి ఉంటాడని అంతా భావించారు. అయితే ఆ వాదనను అతను, ఆ టైంలో అతనితో పాటు మరో ఇద్దరు స్నేహితులు తోసిపుచ్చుతూ వచ్చారు. ఘటన జరిగిన మరుసటిరోజే పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. అతనిది ఉత్తర ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌గా పోలీసులు ప్రకటించారు. అయితే కారు గుంతలో పడిపోయి ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకున్నాయని.. అందువల్లే తనకేం కనబడక ఆ ప్రమాదం జరిగిందని రక్షిత్ వాదించాడు. కావాలంటే బాధిత కుటుంబాన్ని తాను పరామర్శించి.. పరిహారం అందజేస్తానంటూ ప్రకటించాడు. ఈ క్రమంలో.. వాళ్ల నుంచి బ్లడ్ శాంపిల్స్ సేకరించిన ఫోరెన్సిక్ సైన్స్ లాబోరేటరీ 20 రోజుల తర్వాత ప్రాథమిక నివేదిక వెల్లడించింది. అందులో రక్షిత్ గంజాయి సేవించి ఉన్నారని తేలింది. దీంతో ఎడీపీఎస్ యాక్ట్ 1985 ప్రకారం పోలీసులు రక్షిత్‌తోపాటు అతని స్నేహితులపైనా కేసు నమోదు చేశారు. అలాగే.. రక్షిత్‌పై మోటార్ వెహికిల్స్ యాక్ట్‌లోని సెక్షన్ 185 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఇప్పటికే రక్షిత్ వడోదరా సెంట్రల్ జైల్‌లో ఉన్నాడు. అతని స్నేహితుడిని తాజాగా అరెస్ట్ చేయగా.. మరో నిందితుడు పరారీలో ఉన్నాని, అతని కోసం గాలింపు చేపట్టామని పోలీసులు వెల్లడించారు.

# హెచ్‌సీయూ విషయంలో అబద్ధపు ప్రచారాలు

-మొదటిపేజీ తరువాయి

సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు కూడా లేవన్నారు.అలాంటప్పుడు అదే సర్వే నెంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైందని సమావేశంలో చర్చ జరిగింది. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా వీడియోలు, ఫొటోలు సృష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వాస్తవాలు వెల్లడించే లోగా అబద్ధాలు సోషల్ మీడియాలో జాతీయ స్థాయిలో వైరల్ కావటం ప్రభుత్వానికి సవాలుగా మారిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏకంగా నెమళ్లు ఏడ్చినట్లుగా ఆడియోలు, బుల్డోజర్లకు జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్లుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారు చేశారని పోలీసు అధికారులు సీఎంకు వివరించారు. వివిధ రంగాల్లో పేరొందిన ప్రముఖులు కూడా వాటినే నిజమని నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అబద్ధాలకు ఆజ్యం పోసినట్లయిందని అన్నారు. ఏకంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ ధ్రువ్ రాఠీ, సినీ ప్రముఖులు జాన్ అబ్రహం, దియా మీర్జా, రవీనా టండన్ లాంటి వాళ్లందరూ ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ ఫొటోలు, వీడియోల పోస్టు చేసి సమాజానికి తప్పుడు సందేశం చేరవేశారని సమావేశంలో చర్చ జరిగింది. ఈ భూములపై మొట్ట మొదటగా ఫేక్ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్ ఝా కొద్ది సేపట్లోనే తన పోస్టును తొలిగించి క్షమాపణలు చెప్పారని, కానీ మిగతా ప్రముఖులెవరూ ఈ నిజాన్ని గుర్తించకుండా అదే ఫేక్ వీడియో ప్రచారం చేశారని అధికారులు అభిప్రాయపడ్డారు. కంచె గచ్చిబౌలిలో ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాలు విసిరిందని ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఇదే తీరుగా ఇండో పాక్, ఇండో చైనా సరిహద్దుల్లాంటి వివాదాలు,



ఘర్షణలకు దారితీసే సున్నితమైన అంశాల్లో ఏఐతో ఫేక్ కంటెంట్ సృష్టిస్తే భవిష్యత్తుల్లో యుద్ధాలు జరిగే ప్రమాదముంటుందని చర్చ జరిగింది. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తయారు చేసే ఫేక్ వీడియోలు, ఫొటోలు కరోనా వైరస్ ను మించిన మహమ్మారిలాంటివని ఈ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏఐ ఫేక్ కంటెంట్ ను పసిగట్టేలా అవసరమైన అధునాతన ఫోరెన్సిక్ హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్ టూల్స్ను సమకూర్చుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# హైదరాబాద్‌లో బీజేపీ వర్సెస్ ఎంఐఎం

# క్రాస్ ఓటింగ్ పైపూ ఆశలు

హైదరాబాద్ : హైదరాబాద్ స్థానిక సంస్థల కేటగిరి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పో లింగ్ అనివార్యమైంది. ఇప్పటి వరకు ఎం ఐ ఎం, కాంగ్రెస్ అవగాహనతో ఎమ్మెల్సీ సీటు ను ఎంఐఎం ఏకగ్రీవంగా ఎగురేసుకుపోతుందని భావించిన రాజకీయ వర్గాలు ఇప్పుడు బి జెపి కూడా పోటీలో నిలవడంతో గెలుపు ఎవరిదనేది ప్రధానంగా చర్చ మొదలైంది. హైదరాబాద్‌లో స్థానిక సంస్థ కేటగిరీ ఎమ్మెల్సీలో బిజెపికిగానీ, బిఆర్ఎస్‌కు గానీ పూర్తిస్థాయి లో బలం లేదు. దీంతో వీరు పోటీలో నిలవరనేది ప్రచారం జోరుగా సాగింది. కాంగ్రెస్, ఎంఐ ఎంలు అవగాహనతో ఎమ్మెల్సీని మరోమారు ఎంఐఎంకు దక్కుతుందని భావిస్తూ వ స్తున్నారు.అయితే, నామినేషన్లకు చివరి రోజు న బిజెపి నామినేషన్ దాఖలు చేయడంతో ఓటింగ్ తప్పనిసరిగా మారింది. ప్రస్తుతం స్థా నిక సంస్థల కేటగిరి ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానిక సంస్థలు జిహెచ్ఎంసి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులు ఉన్నాయి. కంటోన్మెంట్ బో ర్డుకు ఎన్నికలు జరగనందున సభ్యులెవ్వరూ లేరు. ఇక జిహెచ్ఎంసిలో హైదరాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చే కార్పొరేటర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. ఇందులో బిజె పి, బిఆర్ఎస్‌లకు ఎంఐఎం పార్టీకన్నా తక్కువగా ఓట్లు ఉన్నాయి. హైదరాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క కార్పొరేటర్ కూడా లే రు. ఇక ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా రాజ్యసభ కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక్క ఎంపీ ఉన్నా రు.దీంతో కాంగ్రెస్ పార్టీ పోటీలో లేదు. లోకల్ బాడీ కేటగిరీ ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. ఈ సీటును గెలుచుకునేందుకు బీజెపి రంగంలోకి దిగినట్టు చర్చ మొదలైంది. ఈ ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్, బీజెపిలు అంతర్గతంగా చర్చించుకున్నాకనే బీజెపి పోటీలోకి వచ్చినట్టు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. బీఆర్ఎస్‌కు హైదరాబాద్ జిల్లాలో కార్పొరేటర్లు 20 మంది, 11 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు మొత్తం ఓటర్లు 31మంది ఉన్నారు. బీజెపి నుంచి 20 మంది కార్పొరేటర్లు, 6 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు మొత్తం ఓటర్లు 26 మంది బలం ఉంది. ఎంఐఎం పార్టీకి కార్పొరేటర్లు 41 మంది, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా 7 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపి, ఒక ఎమ్మెల్సీ మొత్తం ఓటర్లు 50 మంది ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎక్స్ అఫిషియో సభ్యులు 5 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓటింగ్ జరిగితే ఎంఐఎం గెలవడం ఖాయంగా కనిపిస్తుంది. అయితే, బీజెపి పోటీకి దిగడంతో ఒక్కసారిగా రాజకీయ సమీకరణలు మారాయి. మొత్తం ఓటర్లుగా 112 మంది ఉండగా ఇందులో కార్పొరేటర్లు 81 మంది, ఎక్స్ అఫిషియో సభ్యులు 31 మంది ఉన్నారు. అభ్యర్థి గెలవాలంటే 57 ఓట్లు రావాల్సి ఉంది. ఇటు ఎంఐఎంకు 50 మంది ఉండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు 6 మంది ఉండటంతో ఈ రెండు పార్టీలు ఈపాటికే




అవగాహనతో ఉన్నట్టు ప్రచారంలో ఉంది. కాంగ్రెస్, ఐఎంఎంలు కలిస్తే 56 ఓట్లు, బీజెపి బీఆర్ఎస్‌లు కలిస్తే 56 ఓట్లు రావడం ఖాయంగా కనిపిస్తుంది. అయితే, కొందరు కార్పొరేటర్లు బీఆర్ఎస్, బీజెపిల నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన విషయం తెలిసిందే.ఎమ్మెల్యే కేటగిరీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 8 మంది ఎమ్మెల్యేలు ఉన్న బీజెపి పోటీకి దిగలేదు. కానీ, ఇప్పుడు స్థానిక సంస్థల కోటాలోని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే 57 ఓట్లు కావాల్సి ఉండగా.. 25 మంది ఓటర్లున్న బీజెపి పోటీలోకి దిగడం రాజకీయ వర్గాలను కాస్తంత ఆలోచనల్లోకి నెట్టేసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌తో బీజెపి చర్చించిన అనంతరమే బీజెపి పోటీలోకి వచ్చినట్టు, ఈ రెండు పార్టీల ఓట్లను లెక్కించుకుని మరీ రంగంలోకి చేరినట్టు తెలుస్తుంది. ఈ రెండు పార్టీలు కలిస్తే ఓట్లు 56గానూ ఉన్నాయి. అయితే, ఆ రెండు, ఈరెండు పార్టీల బలాబలాలు మాత్రం సమంగా కనిపిస్తున్నాయి. ఏ పార్టీ ఓట్లు క్రాస్ జరుగుతాయనేది ఆసక్తికరంగా మారింది.ప్రతిష్టాత్మకంగా మారిన ఎమ్మెల్సీ ఎన్నికలో ఇరు పార్టీలకు క్రాస్ ఓటింగ్ బెంగపట్టుకుంది. పార్టీ విప్ జారీచేసినా.. సభ్యులు ఎవరికి ఓటు వేస్తారనేది సందేహాన్ని రేకెత్తిస్తుంది.

వరీ మిర్జా రియాజ్ ఉల్ అసన్?

మిర్జా రియాజ్ ఉల్ అసన్ 2019లోనే ఎమ్మెల్సీ ఎన్నికయ్యారు. కానీ ఆ పదవి 2023తోనే ముగిసింది. అందుకే ఇప్పుడు మరో ఛాన్స్ ఇస్తున్నారు. ఆయన 2009లో నూర్ ఖాన్ బజార్, 2016లో డబీర్‌పురా కార్పొరేటర్‌గా విజయం సాధించారు.

ఎవరీ గౌతమ్‌రావు? ఆయన్ని రాజాసింగ్ ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

బీజేపీ తరఫున పోటీ చేస్తున్న గౌతమ్‌రావు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. ఎప్పటి నుంచో పార్టీకి పార్టీ సిద్ధాంతలకు కట్టుబడి పని చేస్తున్నారు. ఆయన పనిచేశారు. అభ్యర్థిగా గౌతమ్ రావును ప్రకటించడంపై ఎమ్మెల్యే రాజాసింగ్ మండిపడుతున్నారు. కిషన్ రెడ్డిని టార్గెట్ చేసుకొని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన పార్లమెంట్ నియోజకవర్గానికే పదవులు ఇస్తున్నారని మిగతా బీజేపీ నాయకులు, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గులాంగిరీ చేసేవాళ్లకే పదవులు కట్టబెడుతున్నారని అసంతృప్తి వ్యక్తంచేశారు.

నెల రోజుల క్రితమే బీజేపీ తీన్ మార్

నెల రోజుల క్రితం జరిగిన మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేరుగా రెండింటిని కైవశం చేసుకున్న బీజేపీ మరో స్థానంలో మద్దతుదారుణ్ని గెలిపించుకుంది. ఉమ్మడి కరీంనగర్– ఆదిలాబాద్– నిజామాబాద్– మెదక్ జిల్లాల పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ సీట్లను బీజేపీ తన ఖాతాలో వేసుకుంది. బిజెపి నేతలు మల్క కొమరయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి ఈ రెండు స్థానాల్లో ఘన విజయం సాధించారు. ఉమ్మడి వరంగల్– నల్గొండ– ఖమ్మం టీచర్ నియోజకవర్గంలో బీజేపీ మద్దతు పలికిన పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి ఎంగిలి శ్రీపాల్ రెడ్డి కూడా గెలుపొందదారు.

## ఎంఐఎం కోటలు బద్దలు కొడతాం

-మొదటిపేజీ తరువాయి

అంటకాగి హైదరాబాద్‌ను దోచుకోవడం ఎంఐఎంకు పరిపాటి అయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి ఎంఐఎం కోటలు బద్దలు కొడతామని స్పష్టం చేశారు. సంఖ్యా బలం ఉంటే బీజేపీనే గెలిచేదని.. సంఖ్యా బలం లేదు కాబట్టే ఓటింగ్ జరుగుతోందన్నారు. ఈ ఎన్నికల్లో 120 మంది ఓటర్లు ఆచితూచి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా దేశంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా, హిందువులకు, హిందూ దేవుళ్లకు వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇచ్చే పార్టీ మజ్లిస్ పార్టీ అంటూ మండిపడ్డారు. గతంలో హైదరాబాద్‌లో అనేక సార్లు మతకలహాలు ప్రేరింపించిందన్నారు. అలాంటి మజ్లిస్ పార్టీ అభ్యర్థిని ఏకగ్రీవం చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ చేయకుండా ఉండటం రాజకీయ కుట్రే అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ కూడా ఎంఐఎంకు బానిసత్వంతో ఉండే పార్టీలని వ్యాఖ్యలు చేశారు. మజ్లిస్ పార్టీని పెంచి పోషిస్తున్నాయని ఆరోపించారు. మజ్లిస్ పార్టీ కనుసైగలో ఈ రెండు పార్టీలు నడుస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రెండూ కూడా ఎంఐఎం పార్టీ అడుగులకు మడుగులు ఒత్తుతూ పెంచి పోషిస్తున్నాయన్నారు. మజ్లిస్‌కు ఓటేస్తే ప్రజలెవరూ కూడా క్షమించరని అన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. ఈసారి కచ్చితంగా హైదరాబాద్ నగరంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని.. మేయర్ పీఠం మీద కూర్చోబోయేది భారతీయ జనతా పార్టీనే అని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికలకు, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సంబంధం లేదని అన్నారు. ప్రజల ఆకాంక్షలను గౌరవించి మజ్లిస్ పార్టీని ఓడించాలని... బీజేపీ అభ్యర్థిని గెలిపించాల్సిందిగా ఓటర్లను కోరారు. పార్టీలో అంతర్గత విబేధాలు ఉండటం సహజమని చెప్పుకొచ్చారు. అలాంటివి ఏవైనా ఉంటే పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థిగా గౌతమ్ రావు పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసిన విషయం తెలిసిందే.

## మైనార్టీలపై తమది కపట ప్రేమే

-మొదటిపేజీ తరువాయి

మైనార్టీలు, ముస్లింల సంక్షేమం, సమస్యలంటే పట్టవని రూఢీ అయ్యిందన్నారు. దేశవ్యాప్తంగా మైనారిటీల హక్కులను కాలరాసే కీలకమైన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై చర్చలో రాహుల్ గాంధీ మాట్లాడకపోవడం దారుణమన్నారు. అత్యధిక మంది మైనార్టీ ఓటర్లకు ఎంపీగా ఉన్న ప్రియాంకా గాంధీ సభకే హాజరు కాకపోవడం మరింత దారుణమన్నారు. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతూ తననుతానే రాజ్యాంగ రక్షకుడిగా ప్రచారం చేసుకుంటున్న రాహుల్ గాంధీ లోక్ సభ సాక్షిగా రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుంటే మౌనంగా ఉండటం వెనుక కారణాలమేటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీకి, ఎన్నికల గాంధీలకు ఓట్ల సమయంలోనే మైనార్టీలు గుర్తుకొస్తారా అని నిలదీశారు. టోపీలు పెట్టుకొని ఓట్లడిగి గద్దెనెక్కిన తర్వాత మైనార్టీలను నిండా ముంచడమే కాంగ్రెస్ నైజమని తేలిపోయిందన్నారు. దేశంలో మైనార్టీల హక్కులను కాపాడాది కాంగ్రెస్ పార్టీయేనని రాహుల్ గాంధీ ప్రగ్భలాలు పలుకుతూ ఉంటారని.. వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన ఎటు వెళ్లారు.. ఎందుకు సభలో మైనార్టీల పక్షాన గొంతు విప్పలేదో చెప్పాలన్నారు. ఇద్దరు గాంధీలు లోక్ సభ సభ్యులుగా ఉండి మైనార్టీల తరపున వక్ఫ్ బిల్లుపై మాట్లాడలేదంటే ఇది ముస్లింలను నట్టేట ముంచడం కాదా అని ప్రశ్నించారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ మొదటి నుంచి ఒకే స్టాండ్ తో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల గాంధీల మాదిరి తాము ముస్లింలు, మైనార్టీలకు ద్రోహం చేయలేదన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టసవరణ బిల్లును రాజ్యసభలో బీఆర్ఎస్ వ్యతిరేకించిందన్నారు. మైనార్టీలకు అండగా నిలవాల్సిన సమయంలో రాహుల్ గాంధీ వెన్ను చూపించారని.. కీలకమైన సమయంలో కాడి పడేసిన ప్రధాన ప్రతిపక్షనేత రేపు మైనార్టీలు, ముస్లింలకు ఎలా అండగా నిలుస్తారని నిలదీశారు.

## విస్తరణ... ఇంకా ఉంది

-మొదటిపేజీ తరువాయి

వాటికి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. సామాజికవర్గాల వారీగా కూడా పలువురు నేతలు ఢిల్లీలో లాబీయింగ్‌ను తీవ్రతరం చేశారు. ఇప్పటివరకు సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, వట్టిక శ్రీహరి, వివేక్ పేర్లు ఖరారైనట్లు ప్రచారం జరిగినా, రాహుల్ అభ్యంతరంతో ఈ జాబితాలో మార్పులు సంభవించే సూచనలు కనిపిస్తున్నాయిసీనియర్లు, సామాజిక అంశాలు, జిల్లాల ప్రాతినిధ్యం వంటి అంశాలు తెరపైకి రావడంతో విస్తరణ జరగడానికి బ్రేక్ పడినట్లయింది.

## తెలుగు రాష్ట్రాల్లో దర్శించుకోవాల్సిన రామాలయాలు ఇవే..! ఆ ఆలయాల విశిష్టత తెలుసుకోవాల్సిందే..!

మర్యాద పురుషుడు ఆ శ్రీరాముడు హిందువులకు ఆరాధ్యదైవం. రామ అని పిలిచినందతే కష్టాలు తొలగి సకల శుభాలు కలుగుతాయని పురాణాలు ఘోషిస్తున్నాయి. అందుకేనేమో 'రామాలయం లేని ఊరు ఉండదు.. రాముడిని ఆరాధించని భక్తుడు ఉండడు' అని నానుడి. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీలో ఎన్నో రామాలయాలు ఉన్నాయి. ఆ ఆలయాలకు ఎంతో చరిత్ర ఉన్నది. ఇంతకీ ఆ ఆలయాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకుందాం రండి..! తెలంగాణలోని గోదావరి తీరాన శ్రీరాముడు వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలం. మేరువు, మేనకల కుమారుడు భద్రుడి తపస్సుకి మెచ్చి ఇచ్చిన వరం మేరకు రాముడు సీతాలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి సమేతంగా వెలసినట్లుగా స్థలపురాణం. భద్రాచలానికి క్షేత్రానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉన్నది. భద్రిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పోకల దమ్మక్క అనే భక్తురాలు భక్తిశ్రద్ధలతో రామయ్యను కొలిచేది. ఆ మహా భక్తురాలి భక్తికి మెచ్చి ఓ రోజు శ్రీరాముడు కలలో కనిపించాడు. తాను గతంలో ఇచ్చిన వరం మేరకు.. భద్రగిరిపై కొలువుదీరి ఉన్నానని.. తనను తరించేలా ఏర్పాట్లు చేయమని, నీకు నా పరమభక్తుడు సాయంగా నిలుస్తాడని చెప్పాడు. దమ్మక్క భక్తులతో కలిసి వెళ్లి భద్రగిరి వద్దకు వెళ్లి శ్రీరాముడిని గుర్తించి పందిరి వేసి పండ్లు నైవేద్యంగా పెడుతూ వచ్చింది. ఆ తర్వాత కంచర్ల గోపన్న భద్రాచలంలో రాముడికి ప్రస్తుతం ఆలయాన్ని కట్టించాడు. ఏటా ఇక్కడ జరిగే సీతారాముల కల్యాణం చూసి తీరాల్సిందే తప్ప.. మాటల్లో చెప్పలేం. ఏపీలోని కడప జిల్లాలో ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉన్నది. ఈ ఆలయంలో ఒకే శిలపై కొలువైన సీతారామలక్ష్మణుల విగ్రహాలను అందంగా తీర్చిదిద్దారు. ఎత్తయిన గోపురాలు, విశాలమైన ఆలయ రంగమంటపం, శిల్పకళా వైభవం దర్శించుకునేందుకు రెండు కళ్లు చాలవు. ఈ ఆలయానికి ఎంతో పురాతన ప్రాశస్త్యం ఉన్నది. జాంబవంతుడు కొండపై ఆశ్రమాన్ని నిర్మించాడు. ఉత్తరం వైపును కూర్చొని తారక మంత్రాన్ని జపిస్తూ తపస్సు చేశాడు. మరో గుట్టపై నుంచి రఘురాముడు దివ్యదర్శనం ఇచ్చి వరం ప్రసాదించినట్లుగా స్థలపురాణం చెబుతున్నది. రామయ్యపై భక్తితో సీతారామలక్ష్మణ మూర్తులను ఒకే శిలపై మలచి.. జాంబవంతుడు ప్రాణ ప్రతిష్ట చేసినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. ఈ ఆలయంలో ఆంజనేయుడు కనిపించడు. ఇక్కడ రామయ్య కల్యాణం వెన్నెల వెలుగుల్లో జరుగుతుంది. ఈ ఆలయం విజయనగరం జిల్లా నెల్లిమర్లలో ఉన్నది. ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉన్నది. తొలి విక్రమేంద్రవర్మ పుత్రుడు ఇంద్రభట్టారక వర్మ 469–496 ఏడీ మధ్యకాలంలో ఇక్కడ రాజ్యపాలన చేశారని, ఆ సమయంలోనే ఇక్కడ ఇచ్చ ఆలయం ఉండేదని స్థల పురాణం. కొన్నేళ్ల తర్వాత ఈ ఆలయ జాడ కనుమరుగైపోయిందని.. మళ్లీ 16వ శతాబ్దంలో ఓ వృద్ధురాలికి ఇక్కడి చెరువులో శ్రీరాముడితో సహా ఇతర దేవతా మూర్తులు విగ్రహాలు లభించాయి. ఈ విషయం తెలుసుకున్న అప్పటి పూసపాటి వంశానికి చెందిన మహారాజు పెద్ద ఎత్తున ఆలయం నిర్మించి విగ్రహాలను ప్రతిష్టించారు. చెరువులో విగ్రహాలు దొరకడం వల్లే రామతీర్థం అనే పేరువచ్చిందని స్థానికులు చెబుతుంటారు. పూసపాటి వంశానికి చెందిన మహారాజు ఆలయం నిర్మించడమే కాకుండా భూములను ఇనామ్‌గా ఇచ్చారని.. వాటిపై వచ్చే ఆదాయంతోనే ఆలయంలో పూజాధికాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ శ్రీరామ నవమి ఉత్సవాలకు ఎంతో విశిష్టత ఉన్నది. దేవాలయానికి ఉత్తరాన రెండు కిలోమీటర్ల పొడవునా 600 మీటర్లు ఎత్తున్న ఏకశిలా పర్వతం కనిపిస్తుంది. దానిపై సీతారాములతో పాటు పాండవులు సైతం సంచరించారని స్థానికులు చెబుతుంటారు. అలాగే ఇక్కడ జైనులు, బౌద్ధులు సైతం నివసరించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. కోదండ రామాలయం ఏపీలోని కాకినాడకు 20 కిలోమీటర్ల దూరంలోని గొల్లల మామిడాడలో ఉన్నది. 160 అడుగుల ఎత్తు గోపురం ఉంటుంది. ఇక్కడ వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన సూర్యదేవాలయాలు ఉన్నాయి. ఈ గ్రామంలోకి అడుగుపెడుతూనే ఎన్నో గోపురాలు దర్శనమిస్తాయి. ఈ ఆలయాలు వందేళ్ల కిందట అప్పటి జమిందార్లు నిర్మించారని స్థానికులు పేర్కొంటారు. 1889లో ద్వారంపూడి సుబ్బిరెడ్డి, రామిరెడ్డి సోదరులు భూమిని విరాళంగా ఇవ్వగా.. సీతారాముల విగ్రహాలను చెక్కతో చేయించి.. ఆలయాన్ని నిర్మించారు. 1939లో ఓ పెద్ద ఆలయాన్ని నిర్మించారు. ఆలయ తూర్పు, పడమర గోపురాలు వరుసగా 1948–50, 1956–58 సంవత్సరాల మధ్య నిర్మాణం జరిగింది. నవమి ఉత్సవాలకు ఇక్కడికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. ఈ ఆలయాన్ని చిన్న భద్రాచలంగా పిలుచుకుంటారు. ఇక్కడ శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహిస్తారు. సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా జరుపుతారు. అలాగే, వైకుంఠ ఏకాదశి, విజయ దశమి ఉత్సవాలు సైతం ఘనంగా జరుగుతాయి. డిచ్‌పల్లిలో రామాలయం ఉన్నది. నిజామాబాద్‌కి 27 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉన్నది. 14వ శతాబ్దంలో కాకతీయ రాజులు ఈ రామ ఆలయాన్ని నిర్మించింది. ఈ ఆలయం శైలి, నిర్మాణంలో చాలా పోలికలు ఇంధూరు ఖజురహో అని పిలుస్తాయి. దీన్నే ఖిల్లా రామాలయం అని కూడా పిలుస్తుంటారు. ఈ ఆలయం పైభాగాన, చుట్టూరా ఉన్న ప్యానెల్ అంతా కూడా వాత్సాయన కామసూత్రల నుంచి స్ఫూర్తి పొంది రూపొందించిన శిల్పాలే కావడంతో అవి సహజంగానే 'ఖజురహో'ను గుర్తుకు తెస్తాయి. ఆలయంపై ఉన్న శిల్పాలను స్థానికులు 'గిచ్చు బొమ్మలు'గా పిలిచేవారని చెబుతారు. సంస్కృతంలో 'గిచ్చు' శృంగారానికి పర్యాయ పదం. అందుకే ఈ ఊరుని 'గిచ్చుపల్లి' పిలిచేవారని.. కాలక్రమేన అదే డిచ్‌పల్లిగా మారిందని చెబుతుంటారు. ఇక్కడ ఆలయంలో లోపల బయట గోడలపై ఉన్న కళారూపాలు కాకతీయుల వైభవాన్ని గుర్తుకు తెస్తుంది. శ్రీరామనవమి రోజున ఇక్కడికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అమ్మపల్లి సీతారామచంద్రస్వామి దేవాలయం హైదరాబాద్‌కు సమీపంలోని శంషాబాద్ మండలంలో ఉన్నది. 13వ శతాబ్దంలో వేంగీ చాళుక్యులు ఈ దేవాలయాన్ని నిర్మించినట్లు భావిస్తున్నారు. సీతమ్మవారు కొలువై వున్న కారణంగానే ఈ ఊరికి 'అమ్మపల్లి' అనే పేరు వచ్చిందని చెబుతుంటారు. ఈ ఆలయం 12వ శతాబ్దం నాటికి చెందిందని స్థలపురాణం చెబుతుంది. ఈ ఆలయం దక్షిణ భారత సాంప్రదాయ నిర్మాణ శైలిలో నిర్మించగా.. రామాయణంలోని సన్నివేశాలను వర్ణించే శిల్పాలతో ఇక్కడ కనిపిస్తాయి.

# సంపాదకీయం

## మెగా ఫుడ్ పార్కులతో ఆహార వృథాకు చెక్

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థ. పెరుగుతున్న పునర్వినియోగపరచలేని ఆదాయం ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదా రుల మార్కెట్ వృద్ధికి ఆజ్యంపోసింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ఉత్పత్తిదారులలో భారతదేశం ఒకటి. ప్రపంచంలో భారతదేశం పాలఉత్పత్తిలో మొదటి స్థానం లో, పండ్లు, కూరగాయలు, చేపల ఉత్పత్తిలో రెండో అతిపెద్ద ఉత్పత్తిదారుగా ఉంది. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమకు ముడిపదార్థాల వనరులు దేశంలో సమృద్ధిగా ఉన్నాయి. అయినప్పటికీ, ప్రాసెసింగ్ సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు సాంకేతికత లేకపోవడంవల్ల దేశంలో సహజ ఉత్పత్తులు 2-5% కంటే తక్కువ ప్రాసెస్ చేయబడుతున్నాయి. సరైన ప్రాసెసింగ్ విధానంలేనప్పుడు వ్యవసాయ ఉత్పత్తులు దాదాపు 25-30 శాతం వృథా అవుతుందని అంచనా వేయబడింది. దేశంలో పాడైపోయే ఉత్పత్తులలో 7% మాత్రమే ప్రాసెస్ చేయబడుతున్నాయి, యుఎస్‌లో 65%ం, ఫిలిప్పీన్స్ 78%, చైనా 23% వంటి దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ సామర్థ్యాన్ని మెరుగుపరచాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గ్రహించాలి. ప్రభుత్వం ఈ రంగం వృద్ధిని ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలు చెప్పటాల్సిన అవసరం ఉంది. దీనిని అధిగమించడానికి, ఆహార ప్రాసెసింగ్ రంగాన్ని అభివృద్ధి చేయడం అవసరం. ఎందుకంటే పాడైపోయే వ్యవసాయ ఉత్పత్తుల జీవితకాలం పెంచడం, విలువ జోడింపు ప్రోత్సహించడం భవిష్యత్తులో వ్యవసాయ రంగాన్ని సజీవంగా ఉంచుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం 2008 సంవత్సరంలో ఆహార ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ ద్వారా మెగా ఫుడ్ పార్క్ పథకాన్ని అమలు చేసింది. అది రైతులు, ప్రాసెసర్లు రిటైలర్లను ఒకచోట చేర్చి వ్యవసాయ ఉత్పత్తిని మార్కెట్‌కు అనుసంధానించడానికి ఒక యంత్రాంగాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా వృథాను తగ్గించడం, గ్రామీణ రంగం లో రైతుల ఆదాయాన్ని పెంచడం ఉపాధి అవకాశాలను సృష్టించడం. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల అభివృద్ధి చేయడానికి క్లస్టర్ విధానంపై ఆధారపడి ఉంటుంది. మెగా ఫుడ్ పార్క్ అంటే పొలం నుంచి మార్కెట్ వరకు విలువ గొలుసు వెంట ఆహార ప్రాసెసింగ్ కోసం ఆధునిక మౌలిక సదుపాయాలను అందించడం. మెగా ఫుడ్ పార్క్‌లు క్లస్టర్ ఆధారిత విధానం ద్వారా పొలంనుంచి మార్కెట్ వరకు విలువ గొలుసు వెంట ఆహార ప్రాసెసింగ్‌కోసం ఆధునిక మౌలిక సదుపాయాలను సృష్టిస్తాయి. సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్‌లో సాధారణ సౌకర్యాలు ఎనేబుల్ మౌలిక సదుపాయాలు సృష్టించబడతాయి. ప్రాథమిక ప్రాసెసింగ్ నిల్వ కోసం సౌకర్యాలు పొలం దగ్గర ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు, సేకరణ కేంద్రాలు రూపంలో సృష్టించబడతాయి. ఈ పథకం కింద, భారత ప్రభుత్వం ప్రతి మెగాఫుడ్ పార్క్ ప్రాజెక్టుకు రూ.50 కోట్ల వరకు ఆర్థిక సహాయం అందిస్తుంది. సేకరణ కేంద్రాలు వ్యక్తిగత రైతులు, రైతు సంఘాలు స్వయం సహాయక బృందాల నుండి ఉత్పత్తులను సమీకరించే కేంద్రాలుగా పనిచేస్తాయి. అవి ముడి పదార్థాలను ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలకు అందిస్తాయి. సేకరణ కేంద్రాలు స్థానిక వ్యవస్థాపకులు నిర్వహిస్తారు.ఇవి 10 కిలోమీటర్ల వ్యాసార్థంలో ఉన్న ప్రక్కనే ఉన్న ప్రాంతాలకు వ్యవసాయ స్థాయి సమీకరణ కేంద్రాలుగా పనిచేస్తాయి. ఇసిసిలు గ్రామీణ వాణిజ్య కేంద్రాలుగా ఉద్భవించి, ఆ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తాయి. ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు పిసిసిలు ప్రాథమిక నిర్వహణ కేంద్రాలను కలిగి ఉంటాయి. ఇవి సిపిసిలో మరింత ప్రాసెస్ చేయడానికి ముడి పదార్థాలను ఉపయోగిస్తాయి.పిపిసి సమీపంలో అనేక సిసిలకు సేవలు అందిస్తుంది. కొన్ని పిపిసిలు పల్పింగ్, జ్యూసింగ్ మొదలైన వాటితో సహా ఇంటి లోపల సౌకర్యాలను కలిగి ఉంటాయి. సాధ్యమైనంత తక్కువ సమయంలో సిపిసికి పదార్థాన్ని రవాణా చేయడానికి రిఫ్రిజిరేటర్ వ్యాన్లు, ట్రక్కులు వంటి సౌకర్యాలను కలిగి ఉంటాయి. సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఒక పారిశ్రామిక పార్క్, వివిధ వ్యాపార సంస్థల యాజమాన్యంలోని అనేక ప్రాసెసింగ్ యూనిట్లను కలిగి ఉంది. ఇక్కడ, అభివృద్ధి చెందిన భూమిని పెద్ద, మధ్య తరహా యూనిట్లకు అందించబడుతుంది. కామన్ డిజైన్ ఫ్యాక్టరీ షెడ్లను చిన్నతరహా యూనిట్లకు అందిస్తారు. ఈ పార్క్ నీరు, విద్యుత్, మురుగునీటి శుద్ధి వంటి సాధారణ సౌకర్యాలను అందిస్తుంది. అంతేకాకుండా ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు, సేకరణ కేంద్రాల నెట్‌వర్క్ ద్వారా కోల్ స్టోరేజ్, వేర్ హౌసింగ్, లాజిస్టిక్స్, బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్ వంటి ప్రత్యేక సౌకర్యాలను అందిస్తుంది.వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, 70%కంటే ఎక్కువ గ్రామీణ కుటుంబాలు తమ జీవనోపాధి కోసం వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుత దృష్టాంతంలో జిడిపికి వ్యవసాయ రంగం సహకారం క్రమంగా తగ్గుతోంది. భారతదేశ వ్యవసాయ రంగంలో, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమను ఈ రంగం విస్తరణకు అవసరమైన వృద్ధికి ఇంజిన్‌గా చూస్తారు. వ్యవసాయ రంగం 4% వృద్ధి ప్రమాణాన్ని అధిగమించడానికి, దేశంలో పెరుగుతున్న జనాభా పెరుగుతున్న ఆహార డిమాండ్లను తీర్చడానికి ఆహార ప్రాసెసింగ్ రంగం రెండంకెల రేటుతో అభివృద్ధి చెందాలి. దేశంలో మొత్తం ఆహార ఉత్పత్తి రాబోయే దశాబ్దంలో రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. అయినప్పటికీ ప్రస్తుతం అంతర్జాతీయ ఆహార వాణిజ్యంలో దేశం 1.5% కంటే తక్కువగా ఉంది. ప్రాసెసింగ్ సౌకర్యాలు లేకపోవడం అంటే దాదాపు యుఎస్ 10 బిలియన్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులలో 35 శాతం వృథా అవుతోంది. ఈ నేపథ్యంలోనే రైతులు, వ్యాపారుల మధ్య కీలకమైన సంబంధాన్ని అందించడానికి ఫుడ్ పార్కులు ఒక అవసరంగా మారాయి. దేశంలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ ఒక బిలియన్ వినియోగదారుల దేశీయ మార్కెట్‌ను ఉపయోగించుకోలేదని అధ్యయనాలు చెబుతున్నాయి. అందువల్ల ప్రభుత్వ కొత్త వాణిజ్య విధానంలో ప్రాధాన్యతా రంగం హోదా పొందాల్సిన అవసరం ఉంది.

# ఆధునిక హైదరాబాద్ శిల్పి



మీర్ ఉస్మాన్ అలీఖాన్...భాగ్యనగరంలో విడదీయరాని బంధం, సంబంధం, అనుబంధం ఉన్న పాలకుడు. కొందరు ఆయనను ద్వేషించినా, మరి కొందరు ప్రేమించినా, ఆయన హైదరాబాద్ అభివృద్ధికి చేసిన కృషిని అందరూ అభినందించక తప్పదు. కొందరు ఆయన్ను సంకుచిత మనస్తత్వం గలిగిన, కొందరు మతతత్వం గలిగిన పాలకునిగా, మరికొందరు అతన్ని దుర్మార్గుడు అని భావించినా, ఆధునిక హైదరాబాద్ వాస్తుశిల్పిగా, నిర్మాతగా ఆయన జ్ఞాపకం ఉండక మానదు. ప్రణాళికా బద్ధమైన నగరాన్ని అభివృద్ధి చేయడంలో తన దృష్టిని అమోఘం. కృషి అనన్య సామాన్యం. హైదరాబాద్‌కు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కట్టెదుట కనిపించే ఆయన పోషించిన పాత్రను ఎవ్వరూ కాదన లేని వాస్తవం. ఉస్మాన్ ఆలీ ఖాన్ (ఏప్రిల్ 6, 1886 – ఫిబ్రవరి 24, 1967) మహబూబ్ ఆలీ ఖాన్ రెండవ కుమారుడు. క్రీ.శ. 1911లో నిజాం మరణించడంతో ఏడవ అసఫ్ జా బిరుదుతో నైజాం పదవిని అలంకరించాడు. ఈయనే అసఫ్ జాహీ పాలకులలో చివరివాడు. పూర్తి పేరు " ఫతే జంగ్ నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అసఫ్ ఝా. టైమ్ పత్రిక 1937 సంవత్సరం నిజాంను ప్రపంచంలోని అత్యంత ధనవంతునిగా ప్రచురించింది.1947 ఆగస్టు 15న భారత దేశం స్వాతంత్ర్యం పొందిన అనంతరం హైదరాబాదును స్వతంత్ర రాజ్యం చేయడానికి నిజాం ప్రయత్నించగా, నిజాంతో అనేక సంప్రదింపులు జరిపిన ప్రభుత్వం చివరకు సెప్టెంబరు 13, 1948న ఆపరేషన్ పోలో పేరుతో సైనిక చర్య జరిపి హైదరాబాదు సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేసింది. 1956లో జరిగిన భాషా ప్రయుక్త రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ వలన నిజాం రాజ ప్రముఖ్ పదవి కోల్పోయాడు. ఆయన 1967 సంవత్సర ఫిబ్రవరి 24 తేదీన మరణించాడు. జమిందార్లు, చిన్న గడీదారులు, దొరలు, తాబేదారులు, నిజాం నవాబుకు కప్పం చెలించే వారు కప్పం ద్వారా వచ్చిన ఆదాయంతో ఎన్నో కట్టడాలు నిజాం నవాబులు నిర్మించారు. అలా నిర్మించిన వాటిల్లో పేర్కొన తగినవి...చిరాన్ ప్యాలెస్... హైదరాబాదు లోని కాసు బ్రహ్మానంద రెడ్డి జాతీయ వనంలో 1940లో నిర్మించబడిన చిరాన్ ప్యాలెస్, 400 ఎకరాల్లో విస్తరించి ఉంది.

తెలంగాణ హైకోర్టు...1920, ఏప్రిల్ 20న తెలంగాణ హైకోర్టు ప్రారంభించ బడింది.రాజ్‌భవన్... సోమాజీగూడ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భవనం ఈ రాజ్‌భవన్. ఇది రాష్ట్ర గవర్నరు అధికారిక నివాసంగా ఉపయోగ పడుతుంది. ఆజా ఖానా ఎ జెహ్రా... మూసీ నది తీరంలో ఆజా ఖానా ఎ జెహ్రా అనే ప్రార్థన మందిరం ఉంది. నిజాం సాగర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం 1918 వ సంవత్సరంలో స్థాపించబడింది. ఇది భారతదేశంలో అతిపెద్ద విశ్వవిద్యాలయాలలో ఒకటిగ్. ప్రాథమిక విద్య తప్పనిసరి చేసింది, పేదలకు ఉచితంగా విద్య అందించారు. సిర్పూరు పేపరు మిల్స్, బోధన్ చక్కెర ఫాక్టరీ, అజంజాహీ నూలు మిల్లులు, చార్మినార్ సిగరెట్ ఫాక్టరీ మొదలైన కర్మాగారాలు నెలకొల్ప బడినవి. నిజాం స్టేట్ రైల్వే నెలకొల్ప బడింది. 1965 లో, నిజాం భారత్ చైనా యుద్ధం 1962 సమయంలో 5000 కిలోల బంగారంన్ని యుద్ధ నిధికి అందించాడు. నిజాం హిందువులు, ముస్లింలను తన రెండు కళ్ళుగా భావించి, అనేక దేవాలయాల పురోగతి కోసం అనేక సార్లు బంగారు, డబ్బుని విరాళంగా ఇచ్చాడు.నిజాం రాష్ట్ర రికార్డును పరిశీలిస్తే, మీర్ ఉస్మాన్ అలీఖాన్ 82,825 లను యడ్గిర్గుట్ట ఆలయానికి, 50,000 రూపాయల భద్రాచలం ఆలయం, 80 వేల రూపాయలకు తిరుపతి వెంకటేశ్వర ఆలయానికి దానం చేశాడని తెలుస్తున్నది. 1932 సంవత్సరంలో, భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (పూణే), హిందూ "మహాభారతం" సంకలనం మరియు ప్రచురణకు, అలాగే "నిజాం గెస్ట్ హౌస్" గా పిలువబడే అతిథికి 50,000 రూపాయలు అందించినట్లు పేర్కొన బడింది. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 1967 ఫిబ్రవరి 24 న కింగ్ కోఠి ప్యాలెస్లో మరణించాడు. నిజాం అంత్యక్రియల ఘట్టం భారత చరిత్రలోనే అతి పెద్దదిగా, 10 మిలియన్ ప్రజలు నిజాం ఊరేగింపులో పాల్గొన్నట్లు భావించ బడుతున్నది.

# డీఎన్ఏ నిర్మాణ ఆవిష్కర్త

జీవశాస్త్ర చరిత్రను శాశ్వతంగా మార్చిన శాస్త్రవేత్తల్లో ముందు వరుసలో నిలిచేవాడు జేమ్స్ డేవీ వాట్సన్. డీఎన్ఏ నిర్మాణాన్ని ఆవిష్కరించి, జన్యు శాస్త్రంలో నవ చైతన్యానికి బాట వేసిన ఆయన శాస్త్రీయ దృష్టి, అధ్యయన నిబద్ధత, పరిశోధనలలో చూపిన మేధా ప్రతిభ శాస్త్ర లోకాన్ని ఆశ్చర్య చకిత మయ్యేలా చేశాయి.జేమ్స్ డేవీ వాట్సన్ 1928 ఏప్రిల్ 6న అమెరికాలోని ఇల్లినాయ్ రాష్ట్రం, షికాగో నగరంలోని ఒక సంపన్న కుటుంబంలో జన్మించాడు. చిన్ననాటి నుంచే అసాధారణ మేధస్సుతో మెరిసిన అతను రేడియో క్విజ్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని బాల మేధావిగా గుర్తింపు పొందాడు. కేవలం 15 ఏళ్ల వయస్సులోనే షికాగో విశ్వ విద్యాలయంలో ప్రవేశించి జంతు శాస్త్రంలో పట్టభద్రుడు అయ్యాడు. అనంతరం శాస్త్రవేత్త ఎర్విన్ శ్రోడింజర్ రాసిన ఔష్ఫ్ అం ాఆటవ అనే పుస్తకాన్ని చదివిన తరువాత అతనిలో జన్యుశాస్త్రంపై ఆకర్షణ పెరిగింది. ఫలితంగా ఇండియానా విశ్వ విద్యాలయంలో చేరి, కేవలం 22 ఏళ్లకే జీవశాస్త్రంలో డాక్టరేట్‌ను పొందాడు. 1951లో వాట్సన్ బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో ఉన్న కావెండిష్ లాబొరేటరీలో పరిశోధకుడిగా చేరాడు. అక్కడ బ్రిటిష్ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ క్రిక్‌ను కలుసుకుని, ఇద్దరూ కలసి జీవకణాల్లోని గూఢ రహస్యాన్ని వీడేందుకు కృషి ప్రారంభించారు – అదే డీఎన్ఏ నిర్మాణాన్ని గుర్తించడమే. 1953లో వీరిద్దరూ డీఎన్ఏ అణువు నిర్మాణాన్ని ు డబుల్ హెలిక్స్ నమూనాగా ప్రతిపాదించారు. ఇది ఒక మెలి తిరిగిన నిచ్చెనను పోలి ఉంటుంది. ఈ నమూనా ద్వారా జీవ పదార్థంలో జన్యు సమాచారం ఎలా నిల్వ ఉంటుందో, ఎలా ప్రతిరూపించ బడుతుందో స్పష్టత వచ్చింది. ఈ ఆవిష్కరణ జీవశాస్త్రంలో ఓ మైలురాయిగా నిలిచింది. ఈ అద్భుత ఆవిష్కరణకు గుర్తింపుగా జేమ్స్ వాట్సన్, ఫ్రాన్సిస్ క్రిక్, మారిస్ విల్కిన్స్ 1962లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతిని పొందారు. రోసాలిండ్ఫ్రాంక్లిన్ ఎక్స్-రే డేటా ఉపయోగించ బడినప్పటికీ, ఆమెను ఈ బహుమతికి అనర్హురాలిగా గుర్తించడం పెద్ద వివాదంగా మారింది.డీఎన్ఏ నిర్మాణం గుర్తించిన తర్వాత వాట్సన్ కాలిఫోర్నియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మరియు హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో పనిచేశాడు. 1968లో ఆయన రచించిన ఎష్ట్రవ ఐశీబఎశ్రీవ ఎవశ్రీఅఞ పుస్తకం శాస్త్రీయ రంగంలో సంచలనం రేపింది. డీ ఎన్ ఏ ఆవిష్కరణ వెనుక



ఉన్న వ్యక్తిగత కథ, పోటీ, భావోద్వేగాలు ఈ పుస్తకంలో వ్యక్తమయ్యాయి. వాట్సన్ పరిశోధనలు ఆధునిక బయోటెక్నాలజీకి దారితీశాయి. జీన్ క్లోనింగ్, జీన్ బ్యాంకులు, జెనెటిక్ ఇంజినీరింగ్, నూతన ఔషధాల తయారీ, రోగ నిర్ధారణ పద్ధతులు వీటికి ఆయన కృషి పునాది వేసింది. ఆయన సారథ్యంలో క్యాన్సర్‌కు కారణమైన "ఆంకోజీన్" అనే జీన్‌ను గుర్తించడం అత్యంత కీలక ఘట్టం.1968లో వాట్సన్ కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ ల్యాబొరేటరీ డైరెక్టర్‌గా నియమితు డయ్యాడు. ఇది జెనెటిక్ పరిశోధనకు ప్రధాన కేంద్రంగా మారింది. 1988లో ఆయన "హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్ట్" కి మొదటి డైరెక్టర్‌గా నియమితు డయ్యాడు. ఈ ప్రాజెక్ట్‌కి లక్ష్యం ు మానవ జన్యు క్రమాన్ని పూర్తిగా మ్యాప్ చేయడం. వాట్సన్ శాస్త్ర విజ్ఞానానికి పెద్ద కృషి చేసినప్పటికీ, కొన్ని వివాదాస్పద వ్యాఖ్యల వల్ల ఆయన పరువు నశించింది. జాతి, మేధస్సు, లింగ పరమైన అభిప్రాయాలు శాస్త్ర సమాజం నుండి తీవ్రంగా విమర్శలు పొందాయి. కొన్ని పదవులనూ ఆయన కోల్పోయారు. ఇవి అతని ఘనమైన శాస్త్ర కీర్తిపై కొంతమేర మచ్చలు మిగిల్చాయి. జేమ్స్ డేవీ వాట్సన్ – ఒక శాస్త్రవేత్త, ఆవిష్కర్త, రచయిత. డీఎన్ఏ నిర్మాణం ఆవిష్కరణ ద్వారా ప్రపంచం జీవ పదార్థం యొక్క మూల భూతమైన గమనాన్ని అర్థం చేసుకుంది. ఆయన కృషి వల్ల ఆధునిక జీవశాస్త్రానికి పునాది పడింది. అయితే వ్యక్తిగత అభిప్రాయాల వల్ల కొంతకాలంలో వివాదాలకు లోనైనా, శాస్త్రీయ ప్రపంచంలో ఆయన చేసిన రచనలు, పరిశోధనలు, ప్రేరణ యుగయుగాల వరకు నిలిచి పోతాయి.

# విశ్వశాంతి స్థాపనలో క్రీడలు

క్రీడలు శారీరక పటుత్వం కూర్చే క్రియలు. ఆటలు మానసిక ఉల్లాస లోగిళ్లు. క్రీడలు గెలుపోటములను పరిచయం చేసే క్రియలు. క్రీడా స్ఫూర్తిని నిలపగలిగే క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో శిశు దశ నుంచే ప్రారంభం అవుతాయి. నేడు క్రీడారంగం ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ సమన్వయ సహకార అవగాహనకు నెలవులుగా విశేష కృషి చేస్తున్నాయి. క్రీడల్లో కుల మత వర్ణ వర్గ జాతి విభేదాలకు తావు ఉండదు. క్రీడామైదానాలు సమైక్యతకు ఊతం ఇస్తున్నాయి. క్రీడలతో సరిహద్దులు చెరపబడుతున్నాయి. క్రీడలు మానవజాతికి వినోద కేంద్రాలుగా సేవలు చేస్తున్నాయి. దేశాల మధ్య వారసులుగా క్రీడలు ఉపకరిస్తున్నాయి. సహనం, పట్టుదల, నైపుణ్యం, దేహదారుఢ్యం, గౌరవం, కీర్తి ప్రతిష్టలు, శారీరక సమన్వయం, అభివృద్ధి, శాంతి, ఆశావహ దృక్పథం, క్రీడాస్ఫూర్తి నింపడం, శారీరక మానసిక ఆరోగ్యం లాంటి అనేక అంశాల్లో దోహదపడుతున్న క్రీడలు అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలను కల్పిస్తూనే ఉన్నాయి. క్రీడల్లో అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా అణగారిన వర్గాలకు కూడా సమాన అవకాశాలు కల్పించడంతో పాటు దేశాభివృద్ధికి, విశ్వశాంతికి ఊతం ఇవ్వడానికి ఐరాస చొరవతో 2014 నుంచి ప్రతి ఏట 06 ఏప్రిల్ "అభివృద్ధి, శాంతి స్థాపనకు క్రీడల అంతర్జాతీయ దినం" పాటించడం ఆనవాయితీగా మారింది. ఆరోగ్యకర పౌర సమాజ స్థాపన సుసాధ్యం కావడంతో దేశాభివృద్ధికి మానవ శక్తియుక్తులు సదా ఉపయోగపడుతూనే ఉన్నాయి. అభివృద్ధి, శాంతి స్థాపన కోరుతూ క్రీడలను ప్రోత్సహించడం, క్రీడాకారులను గుర్తించడం, లింగ సమానత్వం సాధించడం, అందరికీ సమాన అవకాశాలు కల్పించడం, క్రీడల విలక్షణ



అనువర్తనాలను అవగాహన పరచడానికి పాటిస్తున్న అభివృద్ధి, శాంతి స్థాపనకు క్రీడల అంతర్జాతీయ దినం-2025 ఇతివృత్తంగా "క్రీడా మైదానాలను సమతలం చేయడం: సామాజిక సమ్మిళిత క్రీడలు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తూ ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు దోహదపడుతున్నాయి. అత్యంత చవకైన క్రీడల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ఆకర్షణీయ ఆదాయ జీవితాలు, పేరు ప్రఖ్యాతులు, సమాజ గౌరవాలు, ఉద్యోగ ఉపాధులు ఆహ్వానిస్తున్నాయి. క్రీడాస్ఫూర్తి నిండిన మనసులు శాంతి మార్గాలను అనుసరిస్తారు. క్రీడలు విలసిల్లిన దేశాల్లో పేదరికం తగ్గుతూ శాంతియుత సహకార భావనలు చిగురిస్తాయి. క్రీడలతో మానవ హక్కుల పరిరక్షణ, ఆర్థిక ప్రగతి, సామాజిక ఉన్నతి, సమాజ ఐక్యత, వాతావరణ సానుకూల మార్పులు, సమగ్రాభివృద్ధి, మహిళా సాధికారత, సమ్మిళిత అభివృద్ధి తప్పనిసరిగా సుసాధ్యం అవుతాయని గమనించి ముందుకు సాగుదాం, క్రీడాకారులుగా లేదా క్రీడాభిమానులుగా అభివృద్ధి, శాంతి స్థాపనకు సహకరిద్దాం.

## కోదండ రామాలయానికి 7క్వింటాళ్ల బియ్యం,ఇతర సామాగ్రి బహుకరణ



**అగ్నిధార న్యూస్,( రామగుండం)** సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలకు కిరాణా మర్చంట్ అసోసియేషన్,రైస్ మిల్ అసోసియేషన్ చేయుతనందించాయి.గోదావరిఖని కోదండ రామాలయంలో ఆదివారం జరగనున్న కళ్యాణ మహోత్సవ వేడుకలకు పులిహోర ప్రసాదం,సిబ్బంది భోజనాల నిమిత్తం 7 క్వింటాళ్ల బియ్యం,సరిపడా చింతపండు,పప్పు,నూనె,మసాలాలు,ఇతర సామాగ్రి ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి.శనివారం సాయంత్రం కోదండ రామాలయంలో జరిగిన కార్యక్రమంలో కిరాణా మర్చంట్ అసోసియేషన్,రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు దేవాదాయ శాఖ ఈవో ముద్దుసాని శంకర్ కు అందజేశారు.11 సంవత్సరాల నుండి కిరాణా మర్చంట్ అసోసియేషన్,రైస్ మిల్ అసోసియేషన్ కళ్యాణ మహోత్సవ వేడుకలకు సహకస్తున్న కిరాణ మర్చంట్ అసోసియేషన్,రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులను ఈ ఓ అభినందించారు.ఈ కార్యక్రమంలో కిరాణ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు చొక్కారపు వెంకటేశ్వర్లు,ప్రధాన కార్యదర్శి చిట్టి మల్ల కిషోర్,కోశాధికారి రేణుకుంట్ల చందర్,నలుమాచు సత్యనారాయణ, ముఖ్య ఉపాధ్యక్షులు అప్పాల విలాస్,రావి కంటి తిరుపతి,నగునూరి సత్యప్రసాద్,కొత్త నాగమల్లయ్య పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్ కు ఘన నివాళి



**అగ్నిధార న్యూస్,(రామగుండం):** రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం బాబు జగ్జీవన్ రాం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ వెంకట స్వామి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శంకర్ రావు, సానిటరీ ఇన్స్పెక్టర్ కుమారస్వామి ,సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ చాలీసా పారాయణం శ్రీరామ మంత్రం శ్రీరామ భజన భగవద్గీత



**అగ్నిధారాన్యూస్"( సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రతి శనివారం మాణిక్ ప్రభు వీధి హనుమాన్ మందిరంలో హనుమాన్ చాలీసా పారాయణం లో భాగంగా ఓంకారం గణపతి గౌరీ గాయత్రి మహా మృత్యుంజయ మంత్రాలతో పాటు లింగాష్టకం ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రం అష్టాదశ పీఠ స్తోత్రం హనుమాన్ ప్రార్ధన హనుమాన్ చాలీసా పారాయణం శ్రీరామ మంత్రం శ్రీరామ భజన భగవద్గీత శ్లోకాలు మరియు హిందూ ధర్మంపై చర్చ కార్యక్రమం మహా హారతి ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది కార్యక్రమంలో శివశక్తి మండల అధ్యక్షులు వేంపల్లి సంగమేశ్వర్ అధ్యక్షతన బుచ్చప్ప రెడ్డి టీచర్ శ్రీనివాస్ రెడ్డి అంబర్నాథ్ ప్రభు వీధి పిల్లలు మహిళలు పాల్గొన్నారు కార్యక్రమానికి విశిష్ట అతిథిగా శివశక్తి జిల్లా అధ్యక్షులు ఎంపీ శ్యామ్ రావు పాల్గొని ప్రసంగించడం జరిగినది. జైశ్రీరామ్

## అదనపు సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించిన హై కోర్ట్ జడ్జిలు



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి )":** జహీరాబాద్ పట్టణం లో అదనపు సివిల్ జడ్జి కోర్టు హై కోర్ట్ జడ్జిలు జస్టిస్ సుధ జస్టిస్ అనిల్ కుమార్ హాజరై ప్రారంభించారు కోర్టు ప్రారంభానికి ముందు వారు పోలీసులు గౌరవ వందనాన్ని స్వీకరించారు కార్యక్రమానికి జిల్లా సెషన్ జడ్జి భవానీ చంద్ర జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ స్థానిక సీనియర్ జూనియర్ జడ్జిలు న్యాయవాదులు పాల్గొన్నారు

# దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం

### : పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

### రామగుండం కమీషనరేట్ లో ఘనంగా బాబూ జగ్జీవన్ రాం 118వ జయంతి వేడుకలు

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రాం 118వ జయంతి వేడుకలు రామగుండము పోలీస్ కమీషనరేటులో ఘనంగా జరిగాయి. రామగుండము పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా బాబూ జగ్జీవన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ .... భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ... స్వరాజ్యం వచ్చాక ఆధునిక భారత దేశ నిర్మాణంలోనూ స్ఫూర్తివంతమైన సేవలు అందించారని, గొప్ప రాజకీయ వేత్తగా సామాజిక సమానత్వం కోసం జీవిత కాలం పోరాడారని, అనేక పదవులను చేపట్టి తనదైన ముద్రను వేశారని అన్నారు. జగ్జీవన్?రాం జీవిత పర్యంతం బడుగు వర్గాల అభ్యున్నతికై కృషి చేశారని తెలిపారు. దేశ రక్షణ మంత్రిగా బాబూ జగ్జీవన్ రాం వేసిన బాటలు దేశాన్ని సురక్షితంగా ఉంచాయని అన్నారు. మనం అందరం కలిసి పని చేసి సమాజం ,రాష్ట్రం అబివృద్ది ఉంటుందని మహనీయుల ఆశయాలను మనమందరం ముందుకు తీసుకపోవాలని, ముఖ్యంగా యూనిఫాం సర్వీస్ల తరపున ప్రత్యేక ధన్యవాదాలు ఎందుకంటే బాబు జగ్జీవన్ రామ్ ప్రత్యేకమైన గౌరవం ఇవ్వడం జరిగినది అందరిని యుద్ధంలో భారత రక్షణ కోసం భాగస్వాములను చేశారు. ముఖ్యంగా ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఈ కార్యక్రమం లో స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు ,ఎ ఆర్ ఎసిపి ప్రతాప్ , ఇన్స్పెక్టర్ లు సతీష్ ,ప్రేం, శ్రీనివాస్ , ఆర్ఐ లు దామోదర్ , శ్రీనివాస్ , మల్లేశం ,ఆర్ ఎస్ ఐ విశ్వజా , సిసి హరీష్ , సిబ్బంది పాల్గొన్నారు



# కలింగ యుద్ధం అశోక్ చక్రవర్తిని మార్చింది

### భారతీయ బౌద్ద మహాసభ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్

**అగ్నిధార న్యూస్ ,(ఆసిఫాబాద్ ):** కళింగ యుద్ధం సామ్రాట్ అశోక చక్రవర్తిని మార్చి ప్రపంచానికి శాంతి మార్గం చూపిన అశోక్ చక్రవర్తిని చూపించిందనీ భారతీయ బౌద్ద మహాసభ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్ ,అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్ లు అన్నారు. శనివారం జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో గల జేత్వాన్ బుద్ధ బీహార్ ప్రాంగణంలో నిర్వహించిన చక్రవర్తి అశోక్ చక్రవర్తి 2330 వ జయంతి వేడుకల్లో పాల్గొని



మాట్లాడారు. అశోక సామ్రాట్ యుగంలో, సామాజిక ప్రక్రియ బలోపేతం చేయబడింది. ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు,రోడ్లు వేయించి రెండు వైపులా చెట్లు నటించిచాడని,. 84 వేల విహారాలల్లో శీలా శాసనాలు చెక్కించారని వ్రాయబడిందని,అతని పాలనలో, మనుషులకు,కాకుండా జంతువులకు కూడా ఆస్పత్రులను నిర్మించి, సేవలు అందించారని,మందుల దుకాణాన్ని 24 గంటలు తెరిచి ఉంచాలని నిర్ణయించారని,తన రాజ్యాన్ని అశోక చక్రవర్తి ఈ ప్రపంచంలోని అన్ని మూలలకు విస్తరింప చేసి పరిపాలించారని పర్గొన్నారు.ఈ కార్యక్రమంలో, అంబేద్కర్ యువజన సంఘ ప్రధాన కార్యదర్శి ,దుర్గ సునీల్, మండల భరతియ బౌద్ద మహాసభ అధ్యక్షుడు జైరామ్ ఉప్రే, అంబేద్కర్ యువజన సంఘం సెక్రటరీ ప్రతాప్, సభ్యుడు ఉప్రే రోషన్ , ఉప్రే విజయ్ దుర్గ, మనోజ్ ,దుర్గ%ప్రశాంత్, జాడే వెఒకట్,విఠల్ చునార్కర్, శ్యామ్ రావు లాహుజీ దుర్గే, రమేష్ దొంగ్దే,శ్యామ్ రావు దొండుజి దుర్గం,పాండు, నాగ్సేన్,తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను వేగవంతం చేయాలి



### సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** 2025 26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను వేగవంతం చేయాలని సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ (పా) కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు.శనివారం ఆయన ఆర్జీ1జిఎం కార్యాలయంలో ఉత్పత్తి,ఉత్పధకత,రవాణా,సంక్షేమం పై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఆర్జీ1 జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ ప్రాజెక్టు ఆఫీసర్లు,ప్రాజెక్టు మేనేజర్స్,ప్రాజెక్టు ఇంజనీర్స్,అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.మెదటిసారిగా జిఎం కార్యాలయానికి డైరెక్టర్(పా) కు జిఎం ఘన స్వాగతం పలికారు.పుష్పగుచ్చం అందజేశారు.శాలువాతో సత్కరించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశిత లక్ష్యాలు బొగ్గు ఉత్పత్తి,ఉత్పదకత ఓబీ రిమూవింగ్,బొగ్గు రవాణా తదితర విషయాల పై సమీక్షించారు.ఈ సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాల సాధనకోసం త్వరితగతిన బొగ్గు రవాణా చేయాలని సూచించారు.బొగ్గు రవాణాలో ఆలస్యం జరగకుండా వెను వెంటనే రవాణా అయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలని వివిధ విభాగాల అధికారులకు దిశా నిర్దేశం చేశారు.బొగ్గు ఉత్పత్తి తో పాటు తప్పని సరైన రక్షణ చర్యలు పాటిస్తూ ఉత్పత్తి చేయాలని సూచించారు.గత సంవత్సరం అర్జీ1లో వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడం అభినందనీయమన్నారు.ఇదే స్పూర్తితో ఈ సంవత్సరం కుడా నిర్ధేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాదించాలని ఆకాంక్షించారు.ఈ సమావేశంలో యస్ఓటు జిఎం గోపాల్ సింగ్,అధికారులు చంద్ర శేఖర్,వెంకటేశ్వర్ రావు,ఆంజనేయులు,శివ నారాయణ,ఏజెంట్లు చిలక శ్రీనివాస్,రమేష్,ఆంజనేయ ప్రసాద్,పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి,కర్ణ,కుమారస్వామి,వర వరప్రసాద్,రాజేష్,లక్ష్మి రాజం,వీరా రెడ్డి,బీమా,హనుమంత రావు ఉన్నారు.

## సింగరేణి ఓసిపి5 ను తనిఖీ చేసిన డైరెక్టర్ వెంకటేశ్వర్లు



**అగ్నిధార న్యూస్,(రామగుండం):**సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్ ప్లానింగ్ అండ్ (పా) కె.వెంకటేశ్వర్లు శనివారం ఓసి5 ని తనిఖీ చేశారు.వ్యూ పాయింట్ ను సందర్శించి ఓసిపి5 స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకన్నారు.ఉత్పత్తి లక్ష్య సాధన దిశగా భవిష్యత్తు ప్రణాళికలు రూపకల్పన చేయాలన్నారు.ఇందుకోసం తగిన సలహాలు,సూచనలు చేశారు.డైరెక్టర్ వెంట ఆర్జీవన్ డీ.లలిత కుమార్,ప్రాజెక్ట్ ఆఫీసర్ చంద్రశేఖర్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.రమేష్ ప్రాజెక్ట్ ఇంజనీర్ రమేష్ అఫీషియటింగ్ మేనేజర్ పి.శ్రీనివాస్ సర్వేయర్ దీటి చంద్రమౌళి పాల్గొన్నారు.

## పేదవాడి కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ..

### ప్రభుత్వంప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుందని

### మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి




**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా మునిపల్లి గ్రామంలో రేషన్ షాపులో రేషన్ కార్డు కలిగిన సన్న బియ్యం పంపిణీ చేశారు ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి పేదవాడికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. తద్వారా రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా సన్న బియ్యం అందుతాయని అన్నారు రేషన్ కార్డ్ దారులకు ప్రజా పంపిణీ చౌక ధరల దుకాణాల ద్వారా అర్హత గల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు

## మండల పూజ సందర్భంగా అన్న ప్రసాద వితరణచేసిన వాసంతి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** శనివారము మండల పూజ సందర్భంగా అన్నప్రసాద వితరణ చేసిన బి.ఆర్.ఎస్ నాయకురాలుసింగిరెడ్డి.వాసంతి వనపర్తి జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ పాతబజార్ వీరాంజనేయ స్వామి దేవస్థానం పునర్ణిర్మానం లో భాగంగా 45 రోజులు మండల పూజ, గణపతి హెూమం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.వనపర్తి జిల్లా అభివృద్ధి ప్రదాత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిఇచ్చిన మాట ప్రకారం గుడిపునర్నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావడం జరిగిందనిఈ సందర్బంగా పూజ కార్యక్రమం లో పాల్గొన్న సింగిరెడ్డి వాసంతిని ఆలయ నిర్వాహకులు సన్మానించారు, అన్న ప్రసాద వితరణ చేసి భక్తుల తో పాటు ఆమే స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె వెంటఆలయ నిర్వాహకులు నీలస్వామి, ఎర్రశ్రీను, గోనూరు వెంకటయ్య, బాలస్వామి, సూర్యావంశం గిరి, మెహన్, సునీల్ వాల్మీకి, శివ లక్ష్మణ్ గౌడ్, బాలరాజు, రాజు, రవి, జస్వంత్ వాల్మీకి, ఇమ్రాన్, మునికుమార్, అలీంముఖ్యులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి.

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి జిల్లా కేంద్రంలో శ్రీరామ థియేటర్ ఎదురుగా ఉన్న డ్రైనేజ్ కాలువలో పడి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందినసంఘటనశనివారం చోటుచేసుకుంది.స్థానికుల సమాచారం మేరకు వనపర్తి జిల్లా కేంద్రం 20 వార్డ్ చెందిన శ్రీను 45 సంవత్సరాలు, కారు డ్రైవర్ గా గుర్తించారు.శనివారం సాయంత్రం డ్రైనేజ్ కాలువలో పడి ఉన్న మృతదేహంని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మున్సిపల్ సిబ్బంది సహాయంతో వనపర్తి ప్రభుత్వ హాస్పిటల్ కు మృతదేహాన్ని తరలించారు.

# జగ్జీవన్ రాం జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం

## ఎమ్మెల్యే మేఘారెడ్డి

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారుశనివారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారుజిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ గిరిధర్ రావుల తో పాటు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. స్వాతంత్ర్య సమరయోధులు , సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారుబాబూ జగ్జీవన్ రామ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారుసమాజంలో అణగారిన వర్గాల సంక్షేమ కోసం అలుపెరుగని కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు తీసుకొస్తుందని చెప్పారురాబోయే రోజుల్లో జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరుతో అణగారిన వర్గాల పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. త్వరలోనే ఎంపీ మల్లు రవి ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసి షెడ్యూల్డ్ కులాల సమస్యలపై చర్చించేందుకు చర్యలు తీసుకుంటామన్నారుజిల్లాలో బాబూ జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ల పేరుతో భవనాల ఏర్పాటుకు కూడా కృషి చేస్తామని చెప్పారు. అంతేకాకుండా వనపర్తి లో నిర్మించిన టౌన్ హాల్ కు అంబేద్కర్ పేరు పెట్టి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, ఎస్పి రావుల గిరిధర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు, షెడ్యూల్డ్ కులాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ నమూనా గృహాన్ని పరిశీలించిన,కలెక్టర్,ఎమ్మెల్యే



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణాన్ని శనివారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలు అతి తక్కువ ఖర్చులో అత్యాధునిక హంగులతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని చేసుకోవచ్చునని వారు సూచించారు. వనపర్తిలో గృహ నిర్మాణ శాఖ అధికారులు నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ (నమూనా గృహాన్ని) సందర్శించి ఏమైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చు అని ఎమ్మెల్యే సూచించారు. వారితోపాటు డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# సీతారాముల కళ్యాణ ఉత్సవానికి సిరిసన గండ్ల ఆలయంలో ఏర్పాట్లు పూర్తి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** చారకొండ మండలం సిరసనగండ్ల గ్రామ సమీపంలో వెలసిన క్షేత్రమే సీతారామచంద్రస్వామి ఆలయం. కోరిన కోరికలు తీర్చే కొరమీసాల రాముడు సీతా లక్ష్మణ సమేతంగా కొలువుదీరిన సిరసనగండ్ల క్షేత్రం బ్రహ్మోత్సవాలకు సిద్ధమయింది. నాగర్ కర్నూల్ జిల్లా చారగొండ మండలం సిరిసనగండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని అయోధ్య నగర్ గుట్టపై దాదాపుగా 500 అడుగుల ఎత్తైన ఏకశిల పై సీతారామ చంద్రుడి ఆలయం ఉంది. అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఈ క్షేత్రంలోని సీతారామచంద్ర స్వామి దేవాలయాన్ని 14 వ శతాబ్దంలో రాచకొండ పద్మనాయకుల హాయంలో నిర్మించినట్లు ఒక స్తంభంపై ఉన్న శిలాశాసనంలో రాసి ఉంది. ఈ ఆలయ నిర్మాణానికి ముందే ముక్కు డి పోచమ్మ దత్తాత్రేయ దేవాలయాలు ఉన్నాయి ఆలయ చరిత్రసిరసనగండ్ల గ్రామానికి చెందిన దేరం రామాయాజ్వి ప్రతిరోజు దత్తాత్రేయ ఆలయంలో తపస్సు చేసేవాడు. ఒకరోజు అతడికి కలలో సీతారామచంద్రస్వామి దర్శనం ఇచ్చాడు భద్రాద్రిలో ప్రతిష్టించే సమయానికి తమ విగ్రహాలు తయారు కాలేదని దీంతో అక్కడ వేరే విగ్రహాలను ప్రతిష్టించారని తెలిపారు ముందుగా సిద్ధంగా చేసిన విగ్రహాలను ఖమ్మం జిల్లా పాల్వంచలోని రావిచేడు గ్రామంలో భాస్కరుడు అనే బ్రాహ్మణుని ఇంటి పెరట్లో ఉన్న కాకర పాదు కింద భద్రపరిచినట్లు తెలిపాడు. వాటిని తీసుకొొచ్చి సిరిసనగండ్ల గుట్టపై ప్రతిష్టించాలని చెప్పి అంతర్జాన మయ్యాడు. ఈ విషయాన్ని రామయాజ్వి గ్రామ పెద్దలకు చెప్పడంతో వారు నమ్మలేదు దీంతో వారికి కూడా స్వామి స్వప్నంలో దర్శనమిచ్చి విషయాన్ని తెలిపారు. దీంతో వారు మేళతాళాలతో నడుమ ఎద్దుల బండ్ల పై ఖమ్మం పట్టణానికి వెళ్లి అక్కడి రాజును కలిసి విషయం తెలిపారు దీంతో రాజు తన భటులతో కలిసి రావిచేడు గ్రామానికి వెళ్లారు. అక్కడ భాస్కరుడు ఇంటికి వెళ్లి స్వప్న వృత్తాంతాన్ని తెలిపారు. కాకర చెట్టు పాదును



తవ్వడంతో సీతారాముని లక్ష్మణుడి ఆంజనేయ స్వామి విగ్రహాలు కనిపించాయి వాటిని తీసుకొస్తున్నగా గ్రామస్తులు అడ్డుకున్నారు. వారికి చెప్పడంతో వారు అంగీకరించారు కానీ ఆంజనేయ స్వామి విగ్రహం తమ గ్రామంలోని ప్రతిష్టించుకుంటామని స్పష్టం చేశారు. దీంతో ఆ విగ్రహాన్ని వారికి ఇచ్చేశారు అనంతరం సీతారాముడు లక్ష్మణుడి విగ్రహాలు సిరసనగండ్లకు తీసుకొచ్చారు. గుట్టపై ప్రతిష్టించినందుకు ఏర్పాటు చేస్తుండగా పోచమ్మ అమ్మవారు వచ్చి అభ్యంతరం తెలిపింది దీంతో శ్రీరాముడు ప్రత్యక్షమై భక్తులు నీ దర్శనం తర్వాతనే తనను దర్శించుకుంటారని అభయమిచ్చారు. అనంతరం విగ్రహాలను పరిశీలించాలని పురాణ కథనం గుట్టపై నైరుతిలో పోచమ్మ తల్లి, తూర్పు దిశలో సీతారామచంద్రస్వామి భక్తులకు దర్శనం ఇస్తారు. రాములవారికి రక్షణంగా అష్టదిక్కుల్లో ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. ఇక్కడ కొలువుదీరిన రాముడు కొరమీసంతో ఉండడం, సీతమ్మ తల్లి స్వామి వైపు వోరగా చూస్తూ ఉండటం ఇక్కడి విశేషమని భక్తులు చెప్తుంటారు. బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల ఐదు నుంచి 11వ తేదీ వరకు ఇక్కడ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఫౌండర్ రామేశ్వర శర్మ, ఈవో స్వర్గం ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆలయాన్ని మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్ళతో పాటు తాగునీటి వసతి కల్పించారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నలుమూల నుండి కాకుండా రంగారెడ్డి, నల్గొండ ,హైదరాబాద్ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలివస్తారు. శ్రీరామనవమి రోజున భద్రాచలంలో మాదిరిగానే ఇక్కడ కూడా ప్రభుత్వ లాంఛనాలతో సీతారాముల కళ్యాణం స్వామి ఘనంగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలు భాగంగా తొలిరోజు ఐదవ తేదీన ఉదయం ధ్వజారోహణం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి మాస కల్యాణోత్సవం ఎదుర్కోళ్ళు పల్లకి సేవ, మహా నివేదన ఉంటాయి. ఆరవ తేదీన ఉదయం స్వామివారికి అభిషేకం అర్చనలు మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కళ్యాణం, రాత్రి ప్రదోష రాజోప చారాలు హనుమత్ సేవ నిర్వహించనున్నారు. ఏడవ తేదీన చిన్న రథోత్సవం (పూలతేరు) కుంకుమార్చన, ఎనిమిదోవ తేదీన శివ దత్తాత్రేయ, పరశు రాముడు, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఉంటాయి. రాత్రి గరుడ వాహన వాహన సేవ, 9న పెద్ద రథోత్సవం నిర్వహించనున్నారు. పదవ తేదీన పల్లకి సేవ, నాగబలి ,పూర్ణాముతి, గజ వాహన సేవ,దోపోత్సవం ఉంటాయి. 11వ తేదీన పోచమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక అర్చనలు, రాత్రి పల్లకి సేవ, చక్రతీర్థం, ద్వాదశ ఆరాధన ,ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

# నేడు కల్వకుర్తి నియోజకవర్గంలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పర్యటన



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి నియోజకవర్గంలో నేడు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఉదయం 11 గంటలకు చారకొండ మండలం సిర్సనగండ్ల జాతర శ్రీ శ్రీ శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి హాజరు కానున్నారు. కావునప్రింట్ % ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు అందుబాటులో ఉన్న అభిమానులు, శ్రేయోభిలాషులందరు పాల్గొనగలరని మనవి.


# సభను విజయవంతం చేసిన మాజీ మంత్రి హరీష్ రావు,కు కృతజ్ఞతలు



## మాజీ జెడ్పిటిసి ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ నాయక్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కడ్తాల్ మండలంలోని ముద్విన్, చరికొండ గ్రామ పంచాయతీలలో పర్యటించి బోయిన్ గుట్ట తండాలో నిర్వహించిన సభను విజయవంతం చేసిన మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తో పాటు మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డిని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ మర్యాదపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వారి నివాసాల్లో కలిసి పూలబొక్కలు ఇచ్చి సన్మానించారు. వారి రాకతో కడ్తాల్ బిఆర్ఎస్ కార్యకర్తల్లో నూతన ఉత్సాహం వచ్చిందని త్వరలోనే జరిగే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా ఏమిటో చాటుతామని తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ ను వారు అభినందించారు సభను విజయవంతంగా నడిపించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ ఎస్టీ కమిషనర్ రాంపాల్ నాయక్ మాజీ సర్పంచ్ లాల్కోట నర్సింహా గౌడ్ నాయకులు అంజి నాయక్ ఈశ్వర్ నాయక్ శ్రీను నాయక్ ప్రశాంత్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బాపు జగ్జీవన్ రామ్ 117 వ జయంతి వేడుకలు గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

పేరొందిన స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త. రాజకీయవేత్త. బీహార్లోని వెనుకబడిన వర్గాలనుంచి వచ్చాడు. అని అతను బాబూజీగా ప్రసిద్ధుడు. భారత పార్లమెంటులో నలభై ఏళ్ళపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉపప్రధానిగా వ్యవహరించాడు అని ఆయన గుర్తు చేశారు .1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో అతను కీలక పాత్ర పోషించాడు. 1937లో బీహార్ శాసనసభకు ఎన్నికయ్యాడు అని ఆయన అన్నారు. ఆ తర్వాత గ్రామీణ కార్మిక ఉద్యమాన్ని నిర్వహించాడు.

ఈ కార్యక్రమంలో ,మాజీ సర్పంచ్,మాజీ ఉప సర్పంచ్,మాజీ వార్డు సభ్యులు,గ్రామ యువకులు తది తరులు పాల్గొన్నారు.

# దేవాలయంలో పూజలు

## భక్తుల త్రాగునీటికై రూ.5,00,000/ తో వాటర్ ప్లాంట్ కు భూమి పూజ

## తెలంగాణ టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**అగ్నిధారన్యూస్ (కల్వకుర్తి) :** ఉర్కొండ మండలం ఉర్కొండ పేట శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమలు నిర్వహించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘ వేందర్ రెడ్డిస్వామివారి దర్శనం అనంతరం దేవాలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం రక్షిత త్రాగు నీటి కోసమై దేవాలయ కమిటీ కోరికమేరకు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఐక్యత ఫౌండేషన్ సహకారంతో 5,00,000/-ఐదు లక్షల రూపాయల తో బోర్ మోటర్ తో సహా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఆలయ కమిటీ చైర్మన్ తో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ తన ఇష్టదైవం శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి స్వామి దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని,అలాగే దేవాలయ కమిటీ విజ్ఞప్తి మేరకు భక్తుల సౌకర్యార్థం ఐక్యత ఫౌండేషన్ సహకారంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ చేయడం జరిగిందని,ఎంతో ప్రాముఖ్యత కలిగిన పబ్బతి ఆంజనేయస్వామి వారికి తన వంతు సేవ చేసుకొనే భాగ్యం దక్కడం సంతోషంగా ఉందని,దేవాలయానికి సంబంధించి ఎలాంటి సహకారానికైన ముందు ఉంటానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. దేవాలయ కమిటీ చైర్మన్ మరియు పాలక వర్గం సభ్యులు మాట్లాడుతూ,అడగగానే గొప్ప మనసుతో స్పందించి శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయానికి విచ్చేసే భక్తులకు త్రాగునీటి సమస్య కై మినరల్ వాటర్ ప్లాంట్ మరియు బోర్ మోటర్ ఏర్పాటు చేస్తున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ,ఆంజనేయస్వామి వారి ఆశీస్సులతో ఇంకా ఉన్నత స్థానాలకు చేరుకొని ఆయు ఆరోగ్యాలతో ముందుకు సాగాలని కోరుకుంటున్నామని ఈ సందర్భంగా తెలియ జేశారు. ఈ కార్యక్రమంలోదేవాలయ పాలకమండలి చైర్మన్ సత్య నారాయణ రెడ్డి, ఈ.వో సత్య చంద్రారెడ్డి ఊరుకొండ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్ రెడ్డి,పిఎసిఎస్ మాజీ చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి,అయూబ్ పాషా,రమేష్ నాయక్,అబ్దుల్ సమీ,గోపి,శ్రీనివాసులు,యూత్ ప్రెసిడెంట్ ఆదినారాయణ, వహీదోద్దీన్,మనోహర్ రెడ్డి, ఆరిఫ్,పాలకమండలి సభ్యులు ఆలయ అర్చకులు దత్తాత్రేయ శర్మ ,మహేష్, మాజీ ప్రజా ప్రతినిధులు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ద్యాప నిఖిల్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేత



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** ఊర్కొండ మండలంలోని మాధారం గ్రామానికి చెందిన బ్యాగరి వెంకటమ్మ అనారోగ్యంతో బాధపడుతు మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న స్థానిక మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ మృతురాలి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ కాంగ్రెస్ నాయకుల ద్వారా రూ.5000/- అందజేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ద్యాప నిఖిల్ రెడ్డి యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# జూనియర్ లెక్చరర్ గా ఎంపికైన రాజేశ్వర్ కి సన్మానం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** వెల్దండ మండలం తిమ్మినోనిపల్లి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి ఇటీవలే జూనియర్ లెక్చరర్ గా ఉద్యోగం పొందిన రాజేశ్వర్ ను అభినందించిన గ్రామ ప్రజలు గ్రామ పంచాయతీ ఆవరణలో ఘనంగా సన్మానించారు కార్యదర్శిగా ఆయన చేసిన సేవలు అందర్నీ కలుపుకోయే వ్యక్తి అని పది నెలలో ఇంత అభిమానాన్ని ఇంతలా ఎవ్వరు ఆకట్టుకోలేదని మాజీ సర్పంచ్ సంగిరెడ్డి రామచంద్రారెడ్డి యువ నాయకులు ప్రశాంత్ రెడ్డి గండికోట రాజు అన్నారు కార్యక్రమంలో, ప్రస్తుత కార్యదర్శి అరుణ శోభన్ బాబు యాదవరెడ్డి జైపాల్ రెడ్డి రామచందర్ అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# గొప్ప సంఘసంస్కర్త డాక్టర్ జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు..

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం ఏప్రిల్ 5**

డాక్టర్ జగ్జీవన్ రామ్ ఫోటోకు పూలమాలవేసి,ఘన నివాళులు అర్పించిన మున్సిపల్ కార్యాలయం సిబ్బంది.. మంచిర్యాల జిల్లా, మందమర్రి మున్సిపాలిటీలో ఏప్రిల్ 5 డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ,జయంతి నీ మున్సిపల్ కమిషనర్ టి.రాజలింగు,భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా..ఆ మహనీయుడికి ఫోటోకు పూలమాలవేసి ఘన నివాళులు,అర్పించారు.ఈసందర్భంగామున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... బాబు జగ్జీవన్ రామ్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడుగా,సంఘసంస్కర్తగా,సమతవాదిగా,రాజకేయవేత్తగా..తన పరిపాలనా దక్షతతో దేశానికి విశేష సేవలను అందించిన మహనీయులు అని కొనియాడారు. వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయం సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత,అనగారిన వర్గాల అభ్యున్నతకై కృషి చేసినాడు,భారత దేశం లో హరిత విప్లవం,భారత వ్యవసాయాన్ని ఆధునికరించడంలో అందించిన సహకారం ఎంతో గొప్పది అని అన్నారు.కుల రహిత సమాజం కోసం జీవితాంతం కృషి చేసిన బలహీన వర్గాల నేత,దేశ స్వాతంత్రం కోసం సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత అని కొనియాడారు.బాబు జగ్జీవన్ రామ్ గారిది 118వ,జయంతి భారత దేశ ఉప ప్రధానిగా చేశారు..40 సంవత్సరాలు పార్లమెంట్లో అనేక పదవులు నిర్వహించారు.భారతదేశంలో సుదీర్ఘకాలం క్యాబినెట్ మంత్రిగా ఉన్న రికార్డు అతని సొంతం.కేంద్ర కార్మిక మంత్రి, కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి,కేంద్ర రవాణా,రైల్వే మంత్రి, కేంద్ర రవాణా కమ్యూనికేషన్, కేంద్ర కార్మిక,ఉపాధి పునరావాసం మంత్రి, కేంద్ర ఆహార,వ్యవసాయ మంత్రి, కేంద్ర రక్షణ మంత్రి, కేంద్ర వ్యవసాయ,నీటిపారుదల మంత్రి.భారత ఉప ప్రధాన మంత్రిగా,24 జనవరి 1979 – 28 జూలై 1979. జెడ్ కేటగిరీ భద్రతా గల వ్యక్తి..ఇట్టి కార్యక్రమంలో..బిల్ కలెక్టర్ బి.లింగయ్య, పబ్లిక్ హెల్త్ వర్కర్లు సి.హెచ్. రాజశేఖర్,ఎస్.



భాను, ఇంచార్జి టీ.ఎం.సీ., ఏ.రఘురాం,డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బి. శ్యాంబాబు,ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎం గోపికృష్ణ,సిస్టం అసిస్టెంట్ వి. ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# పరిధికి మించి వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు

**రంగారెడ్డి జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు హెచ్చరిక**

**షాద్ నగర్ లో నాలుగు క్లినిక్ లు సీజ్**

**పలు క్లినిక్ లకు షోకాజ్ నోటీసులు**

**ఆర్ఎంపీలు, పీఎంపీలు డాక్టర్ అనే పదాన్ని వాడకూడదు**

**వైద్యశాల, ప్రజా వైద్యశాల, ఆసుపత్రి అనే పేర్లతో బోర్డులు పెట్టకూడదు**



**రంగారెడ్డి :** తమ పరిధికి మించిన వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో స్థానిక డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి తదితర సిబ్బంది ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు జరిపారు. పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్న నాలుగు ఆర్ఎంపి పిఎంపి క్లినిక్ లను తనిఖీ చేసి సీజ్ చేశారు. పట్టణంలో నిర్వహిస్తున్న కీర్తి పాలీ క్లినిక్, ప్రజా వైద్యశాల, రాజా మెడికల్ హాల్ వెనుక భాగంలో ఉన్న దవాఖాన, మనిశ్విని క్లినిక్ లను సందర్శించి డాక్టర్ వెంకటేశ్వరరావు వాటిని సిస్ చేశారు. కీర్తి క్లినిక్ పై డాక్టర్ రాజు అని పేరు రాసుకోవడం జరిగిందని ఇది తప్పని డాక్టర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు.

ఈ సందర్భంగా పలు క్లినిక్ లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రాథమిక వైద్యం చేయకుండా ఇష్టం వచ్చినట్లు పరిధి దాటి మరి కొందరు వైద్యం చేస్తున్నారని ఆయన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. పరిధికి మించి వైద్యం చేసే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని అన్నారు. ఆర్ఎంపీలు పీఎంపీలు డాక్టర్ అనే పదాన్ని అసలు వాడుకోవద్దని హెచ్చరించారు. ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే ఉండాలని, ఎవరు ప్రజా వైద్యశాల వైద్యశాల ఆసుపత్రి అని బోర్డులు పెట్టుకోరాదని హెచ్చరించారు. ఆర్ఎంపీలతో క్వాలిఫై డాక్టర్స్ సైతం ఇక్కడ విలవిలలాడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వారం రోజులపాటు నిరంతరంగా వైద్య ఆరోగ్యశాఖ దాడులు నిర్వహిస్తుందని హెచ్చరించారు. అనుమతి లేని ఆసుపత్రుల్లో బెడ్లు ఉండకూడదని సూచించారు. ఈరోజునుండి షాద్ నగర్ ప్రాంతంలో ఆరోగ్యశాఖ పెద్ద ఎత్తున నిఘా ఏర్పాటు చేస్తుందని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే ఆర్ఎంపీల నియంత్రణ జరుగుతుందని సూచించారు. అనారోగ్యంతో బాధపడేవారు కేవలం క్వాలిఫై డాక్టర్లను మాత్రమే సంప్రదించాలని అనవసరంగా ఆర్ఎంపీలు పీఎంపీల వద్దకు వచ్చి విలువైన వైద్యం చేసుకోకూడదని దీనివల్ల అనేక దుష్పరిణామాలు కూడా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ విజయలక్ష్మి, మాస్ మీడియా అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

# ఇంటర్ పేపర్ కరెక్షన్స్‌లో కీలక మార్పులు

**హైదరాబాద్ :** తెలంగాణలో ఇంటర్ ఫలితాల్లో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా ఇంటర్మీడియట్ బోర్డు జాగ్రత్తలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా జవాబుపత్రాల మూల్యాంకనంలో ఈసారి ముందస్తు పునఃపరిశీలన చేయాలని బోర్డు నిర్ణయించింది. సాధారణంగా ఇంటర్ ఫలితాలు వెలువడిన తర్వాత మార్కులు సరిగా రాలేదని, లెక్చరర్లు చేసిన తప్పిదం వల్లే తాము ఫెయిల్ అయ్యామని విద్యార్థులు ఆరోపిస్తుంటారు. ఈ నేపథ్యంలో 35 మార్కులు రాని విద్యార్థులకు సంబంధించి జవాబుపత్రాలను చీఫ్ ఎగ్జామినర్, సబ్జెక్టు నిపుణులతో క్షుణ్ణంగా పునఃపరిశీలన చేయించనున్నట్లు బోర్డు వర్గాలు తెలిపాయి. దీంతో విద్యార్థులకు అన్యాయం జరగకుండా ఉంటుందని వారంటున్నారు. ఏప్రిల్ 10 నాటికి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తికానుంది. ఫలితాలను ఏప్రిల్ చివరి వారంలోగా వెల్లడించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.తెలంగాణలో ఇంటర్ ప్రధాన పరీక్షలు మార్చి 20తో ముగిసిన సంగతి తెలిసిందే. అయితే బ్రిడ్జ్ కోర్సు, అన్ని సబ్జెక్టుల పరీక్షలు మార్చి 25తో పూర్తయ్యాయి. ఇప్పటికే ప్రధాన సబ్జెక్టులకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ కూడా ప్రారంభమైంది. పరీక్షల మొదట్లో ప్రశ్నపత్రాల్లో చిన్నచిన్న తప్పులు దొర్లినా... ఆ తర్వాత అన్ని సబ్జెక్టుల పరీక్షలు సజావుగా జరిగాయి. పరీక్షల ఫలితాలను ఏప్రిల్ నెలాఖరులోపు విడుదల చేయాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది.రాష్ట్రంలో అగ్రికల్చర్, ఫార్మ, ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన 'టీజీఎప్‌సెట్-2025' పరీక్షలు ఏప్రిల్ 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పరీక్షల ప్రారంభానికి కనీసం రెండు మూడు రోజుల ముందుగా... అంటే ఏప్రిల్ నాలుగో వారంలో ఫలితాలు విడుదల చేయాలని ఇంటర్ లక్ష్యంగా పనిచేస్తోంది.గతేడాది మార్చి 19 నాటికి ఇంటర్ పరీక్షలు పూర్తికాగా.. ఏప్రిల్ 24న ఫలితాలు విడుదల చేశారు. ఈసారి కూడా దాదాపు అదే తేదీలో ఫలితాలు వెలువడే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9.80 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.



ఇన్ని దశలు దాటిన తర్వాత మార్కులు బోర్డుకు వెళతాయి. మూల్యాంకన సమయంలో ఇచ్చిన కోడ్‌ను ఇంటర్ బోర్డ్‌లో డీకోడ్ చేస్తారు. ఆ విద్యార్థి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

సాఫ్ట్‌వేర్‌పై ట్రయల్ రన్ చేస్తారు. కొందరు విద్యార్థుల మార్కులను నమోదు చేసి.. సాంకేతిక లోపాలేమైనా ఉన్నాయా.. అని మానవ వనరుల ద్వారా పరిశీలిస్తారు. ఇలా మొత్తం 4 రౌండ్లు ట్రయల్ జరుపుతారు. ఎలాంటి సమస్య లేకపోతే.. తుది దశ ఫలితాలను నమోదు చేస్తారు.

### మూల్యాంకనం సాగుతోందిలా..

ఇంటర్ పత్రాల మూల్యాంకనం కోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి లోపాలు లేకుండా మూల్యాంకనం ప్రక్రియ చేపట్టనున్నారు. మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత.. ఫలితాలను విడుదల చేయనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 19 స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు 14 వేలమంది సుమారు 60 లక్షల జవాబుపత్రాలను దిద్దాల్సి ఉంటుంది.

సమాధాన పత్రాలను పలు స్థాయిల్లో పరిశీలిస్తారు. ఆ తర్వాతే మార్కులను ఖరారు చేస్తారు. రోజుకు ఒక్కో అధ్యాపకుడు 40 సమాధాన పత్రాలను మాత్రమే మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. వారిని అసిస్టెంట్ ఎగ్జామినర్ అంటారు.

పరీక్షలో ఇచ్చిన ప్రశ్నలకు తగిన సమాధానాలను నిపుణులు మూల్యాంకన ప్రక్రియ కోసం పంపుతారు. వీటి ఆధారంగా అసిస్టెంట్ ఎగ్జామినర్ జవాబుపత్రాలను పరిశీలించి మార్కులు వేస్తారు. కొన్ని పరిమితుల మేరకు విచక్షణాధికారంతో మార్కులు వేయవచ్చు. తర్వాత ఆ జవాబుపత్రం చీఫ్ ఎగ్జామినర్‌కు వెళ్తుంది. వారు మార్కులను, మూల్యాంకన తీరును పరిశీలిస్తారు.

తర్వాతి దశలో జవాబుపత్రం సబ్జెక్టు నిపుణుల వద్దకు వెళుతుంది. ఎక్కడైనా పొరపాటు ఉంటే నిపుణులు సరిచేస్తారు. ప్రతీ ప్రక్రియ, ప్రతీ మార్పును చీఫ్ ఎగ్జామినర్ రికార్డు చేస్తారు.

జవాబుపత్రాల మూల్యాంకనం ఇవాళ ప్రారంభమై నెల రోజుల పాటు కొనసాగుతుంది. మే మొదటి వారంలో ఫలితాలు వెల్లడించే అవకాశం ఉంది. మూల్యాంకనం ప్రక్రియను ఈసారి ఆధునిక పద్ధతుల్లో చేపట్టబోతున్నారు. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డ్ కార్యాలయానికి ప్రతీ కేంద్రాన్ని అనుసంధానం చేస్తున్నారు.

ఈసారి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. మూల్యాంకనం చేసే అధ్యాపకులు ఏ సమయంలో వస్తున్నారు.. ఎప్పుడు కేంద్రం నుంచి వెళుతున్నారనే వివరాలను రికార్డు చేస్తారు.

ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు లేని అధ్యాపకులనే మూల్యాంకనం కోసం ఎంపిక చేయాలని.. జిల్లా అధికారులకు తెలంగాణ ఇంటర్ బోర్డ్ ఆదేశాలిచ్చింది.

ఫస్ట్, సెకెండ్ ఇయర్ కలిపి మొత్తం 9లక్షల 96వేల 971 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. వీరందరి అన్ని సబ్జెక్టులు కలిపి సుమారు 60 లక్షల సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాల్సిఉంది.

స్పాట్ వ్యాల్యుయేషన్ జరిగే 19 కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. శాస్త్రీయ పద్ధతిలో ఈసారి మూల్యాంకనం ఉండబోతోంది. ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి..!



## ఈ నెల 27 న వరంగల్లో కేసీఆర్ సభకు బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలి

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుక వెళ్లాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, యూత్ మండల అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్ అన్నారు. కమాన్ పూర్ మండలంలోని సిద్దిపల్లె గ్రామంలో శనివారం బీఆర్ ఎస్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 27 న వరంగల్లో జరిగే బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యే బహిరంగ సభకు కమాన్ పూర్ మండలంలో నుండి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రుణమాఫీ అసంపూర్తిగా మిగిలిపోయిందని, రేషన్ కార్డుల జారిలో జాప్యం జరుగుతోందని, రైతు పెట్టుబడి సాయంలో కూడా జాప్యం చేస్తుందని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచిన నేటికీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పిటీసీ మేకల సంపత్ యాదవ్, మాజీ సర్పంచ్ కొండా వెంకటేష్, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మి మల్లు, పిఎసిఎస్ వైస్ చైర్మన్ చిందం తిరుపతి, మాజీ ఉప సర్పంచ్ లు జాబు సతీష్ , పోలుదాసరి సాయి కుమార్, నాయకులు నీలం శ్రీనివాస్, రాచకొండ రవి, రెడ్డి రాయనర్సు, దండే కిషన్, జాబు శ్రీనివాస్, బైరి అంజయ్య గౌడ్, దీకొండ కొమురయ్య, కొయ్యడ రవి, రాంపల్లి రవి, చినరాయుడు, తోట రాజ్ కుమార్, సాన సురేష్ కురుమ, తాటికొండ హరీష్, పెండ్లి నారాయణ, పల్లె నారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ధరలేని ధాన్యం : మద్దతుధర మాయ

**నల్గొండ :** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర ప్రకారం ? సన్న రకాల వరి (హెచ్ఎంటీ , జైరాం చింట్లు,మహేంద్ర) ధర రూ.2320. క్వింటాల్కు అదనంగా రూ.500 బోనస్ కలిపి రూ.2820 చెల్లించాల్సి ఉంది. తేమ శాతం 17 లోపల ఉంటే ? ఈ ధర వర్తించాలి. కానీ మిల్లుల్లో వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నం. తేమ,పచ్చ గింజ, రంగు మార్పు వంటి నెపాలు చూపుతూ ? రైతులకు క్వింటాలు కు రూ.2400 కూడా ఇవ్వట్లేదు. ఫలితంగా రైతులు ధాన్యాన్ని నష్టాల్లో అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే బియ్యం మార్కెట్లో కిలోకు రూ.60 దాటి విక్రయమవుతోంది. కానీ దీనికి మూలమైన రైతుకి మాత్రం గిట్టుబాటు లేని ధర. వ్యవసాయానికి పెట్టుబడి పెరిగినా, లాభం కనపడడం లేదు. మిల్లర్లు సిండికేట్ గా మారి రైతులను నిలువునా దోచుకుంటున్నారు.ఒక రోజు ముందే రేపటి ధరను నిర్ణయించి వాట్సాప్ గ్రూప్ లలో పోస్ట్ లు చేసుకుంటున్నారు.ఎవరి వద్దకెళ్లినా ధర ఒకటే. ఇది రైతుల ఆత్మవిశ్వాసాన్ని తొలగించే స్థాయికి చేరుతోంది.నిఘా లేకపోవడం వల్లే వ్యవస్థ పూర్తిగా విఫలమవుతోంది.రైతుకు మద్దతుధర ఇచ్చేందుకు వచ్చిన విధానాలు, ఆదేశాలు క్షేత్ర స్థాయిలో అమలుకావడం లేదు. రైతు నష్టాల్లోకి జారుకుంటున్న వ్యవసాయాన్ని గౌరవించాల్సిన సమయం ఇది.ప్రభుత్వం ఆదుకోకపోతే రైతు భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుంది.మద్దతుధర లభించని పంట రైతును మళ్లీ అప్పుల బాటలో పడేస్తోంది.ప్రభుత్వం తక్షణమే రైస్ మిల్లులపై నిఘా పెట్టాలి. రైతు కష్టాన్ని పణంగా పెట్టే ధోరణికి అడ్డుకట్ట వేయాలి.ధాన్యం కొనుగోళ్లలో సిండికెట్ గా మారిన మిల్లర్ల పైఉక్కు పాదం మోపాలి. ఎందుకంటే రైతు బతికితేనే దేశ భవిష్యత్తు బాగుంటుంది.

## ఆరుగురు కుటుంబ సభ్యులు అదృశ్యం

**సికింద్రాబాద్ :** బోయిన్ పల్లి ఠాణా పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ఆరు మంది వ్యక్తులు అదృశ్యం అయ్యారు. న్యూ బోయిన్ పల్లి ఏడుగుళ్ల సమీపంలో నివాసం ఉండే మహేష్, ఉమా దంపతులు తమ ముగ్గురు పిల్లలతో పాటు సంధ్య అనే మరొక కుటుంబ సభ్యురాలు కూడా అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మహేష్ బోయిన్పల్లి లో నీటి సరఫరా కేంద్రంలో ఆపరేటర్ గా పనిచేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన బిక్షపతి సోదరి ఉమా వాళ్ళ ఇంటికి నిన్న ఉదయం వెళ్ళింది. మహేష్ ఉమా దంపతులు తమ పిల్లలైన రిషి, చైతు, శివన్ లతో పాటు సంధ్యను కూడా తమతోపాటు బయటకు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఆరు మంది కుటుంబ సభ్యులు బయటకు వెళ్లినట్లు ఇంటి యజమాని ఫిర్యాదుదారుడు బిక్షపతి కి చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఒకేసారి ఆరు మంది కుటుంబ సభ్యులు ఇంటి నుండి బయటకు వెళ్లి ఆటో బుక్ చేసుకుని బోయిన్పల్లి నుండి ఇమ్లీబన్ బస్ స్టాప్ వరకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఇమ్లీబన్ బస్ స్టాప్ నుండి ఈ ఆరు మంది ఎటు వెళ్లారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అదృశ్యం కింద కేసు నమోదు చేసుకున్న బోయిన్పల్లి పోలీసులు సీసీ కెమెరాలు ఆధారంగా ఆరు మంది కుటుంబ సభ్యుల ఆచూకీ గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

## క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో మృతి చెందిన బీటెక్ విద్యార్థి

**హైదరాబాద్ :** సీఎంఆర్ కాలేజీలో నిర్వహించిన టోర్నమెంట్లో క్రికెట్ ఆడుతూ ఖమ్మం జిల్లాకు చెందిన బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి కుప్పకూలాడు. వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. కళ్ల ముందే తమ స్నేహితుడు మృతి చెందడంతో తోటి విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురైయాడు.

## నల్లగొండ జిల్లాలో జోరుగా నకిలీ మద్యం

**నల్లగొండ :** నాన్‌డ్యూ టీ పెయిడ్(ఎన్‌డిపి)మద్యం విక్రయాలకు అడ్డా బ్రాండెడ్ బాటిల్స్ మూతలు తీయడం.. తక్కు వ ధర లిక్కర్ కలవడం.. మళ్ళీ యధావిధిగా బాటిల్స్ తయారు చేయడం.. ఇదంతా కొందరు ని పుణులు చేసే పని. ఈ తతంగాన్ని గతంలో పోలీసులు ఛేదించారు. కట్టడిచేసే ప్రయత్నం చేశా రు. కానీ ఇప్పుడు ఏకంగా స్పిరిట్, అందులో క లిపే లిక్విడ్స్‌తోనే బ్రాండెడ్ మద్యం తయారీ చే స్తున్నారు. ఇందులో నైపుణ్యత సాధించిన కొం దరు కేటుగాళ్ళు స్పిరిట్‌ను ఖరీదైన లిక్కర్‌లో నింపి యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని మారుమూల వైన్స్‌షాపు లు, బెల్ట్‌షాపులను టార్గెట్‌గా చేసుకొని నకిలీ మ ద్యం దందా సాగిస్తున్నారు. గత కొన్నేళ్ళుగా ఈ దందా సాగుతున్నట్లు చర్చ జరుగుతోంది. వ్యవసాయ క్షేత్రాలు, తోటలను అడ్డాగా చేసుకొని మూడు పువ్వులు ఆరు కాయలుగా నకిలీమ ద్యం తయారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తయారీకి పెట్టుబడి పెట్టడం.. తయారుచేసిన బాటిల్స్ పెద్దమొత్తంలో తరలిస్తూ విజయవాడకు చెందిన ఓ వ్యక్తి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.నల్లగొండ జిల్లాలోని కనగల్, నాంపల్లి మం డలాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు




# వారియర్ లుక్‌లో రష్మిక.. పాటతో ఆకట్టుకున్న విజయ్ దేవరకొండ!

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా "ది గర్ల్ ఫ్రెండ్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. ఈ రోజు(ఏప్రిల్ 5)రష్మిక బర్త్ డే సందర్భంగా "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా నుంచి విశెస్ చెబుతూ కొత్త పోస్టర్, టీజర్ సాంగ్ 'రేయి లోలోతుల' రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో రష్మిక వారియర్ లుక్ లో గన్, కత్తితో పవర్ ఫుల్ గా కనిపిస్తోంది. 'రేయి లోలోతుల' పాటను మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వాహబ్ బ్యూటిఫుల్ గా కంపోజ్ చేయగా, రాకేందు మౌళి క్యాచీ లిరిక్స్ అందించారు. విజయ్ దేవరకొండ, హేషమ్ అబ్దుల్ వాహబ్, చిన్మయి శ్రీపాద ఆకట్టుకునేలా పాడారు. ఈ పాటలో వచ్చే పోయెమ్ ను డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ రాశారు. 'రేయి లోలోతుల' పాట ఎలా ఉందో చూస్తే – 'రేయి లోలోతుల సితార, జాబిలి జాతర, కన్నులలో వెన్నెలలే కురిసే, మదిమోసే తలవాకిట తడిసే, యెద జారెనే మనసు ఊగెనే, చెలి చెంతలో జగమాగెనే, యెద జారెనే మనసా..' అంటూ మంచి లవ్ ఫీల్ తో సాగుతుందీ పాట. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఉన్న "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.


# క్లీవేజ్ షోతో కళ్ళు చెదరగొడుతున్న దివ్య భారతి



# జూనియర్ ఎన్టీఆర్ నా ఫేవరెట్.. కానీ ఆ విషయంలో భయంగా ఉంది



జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ 'డ్రాగన్' సినిమాతో బిజీగా ఉన్నాడు. అటు బాలీవుడ్‌లో హృతిక్ రోషన్ 'వార్ 2' మూవీ లోనూ భాగమయ్యాడు. ఈ సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది. జార్జియాలో జరిగిన వార్ 2 ఈవెంట్‌లో హృతిక్ ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. హృతిక్ మాట్లాడుతూ.. వార్ సినిమా సీక్వెల్ ఎలా ఉంటుందోనని చాలా భయపడ్డాను. కానీ ఇప్పుడీ సినిమా చూస్తుంటే గర్వంగా ఉంది. మొదటి భాగం కంటే కూడా ఇదే మరింత బాగుంటుంది. జూనియర్ ఎన్టీఆర్ నా ఫేవరెట్ కోస్టార్. తను అద్భుతమైన వ్యక్తి, చాలా తెలివైనవాడు. ఒక పాట మినహా మిగతా షూటింగ్ అంతా పూర్తయింది. ఆ పాటలో ఎన్టీఆర్‌తో కలిసి డ్యాన్స్ చేయాలంటే కాస్త భయంగా ఉంది. తను ఎలాగైనా చేయగలడు. నేను కూడా బాగా డ్యాన్స్ చేస్తానని అనుకుంటున్నాను. మీరు మా సినిమాను తప్పక ఆదరించాలి అని చెప్పుకొచ్చాడు. వార్ 2 విషయానికి వస్తే.. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ సినిమాను యశ్ రాజ్ ఫిలింస్ బ్యానర్‌పై నిర్మించారు. ఈ మూవీతో తారక్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వనున్నాడు. హృతిక్ రోషన్ నెక్స్ట్ 'క్రిష్ 4' సినిమా చేయనున్నాడు. ఈ చిత్రంతో అతడు దర్శకుడిగా మారనున్నాడు. '25 ఏళ్ల క్రితం నిన్ను నటుడిగా ప్రవేశపెట్టాను.. మళ్లీ పాతికేళ్ల తర్వాత నిన్ను దర్శకుడిగా పరిచయం చేస్తుండటం సంతోషంగా ఉంది' అని హృతిక్ తండ్రి రాకేశ్ ఇటీవల సోషల్ మీడియా పోస్ట్‌లో వెల్లడించాడు.




# శ్రీలీలని అచ్చం నా పెళ్లంలాగే ఉన్నావన్న నెటిజన్..

## క్రేజీ రియాక్షన్ ఇచ్చిన ముద్దుగుమ్మ

ప్రస్తుతం టాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌లో ఒకరిగా ఉన్న అందాల ముద్దుగుమ్మ శ్రీలీల. తెలుగులో శ్రీలీలకి మంచి అవకాశాలు వచ్చిన వాటిని ఎందుకో వినియోగించుకోలేకపోయింది. తాను చేసిన ప్రాజెక్ట్‌లు ఒక్కొక్కటిగా గాడి తప్పాయి. ఇటీవల వచ్చిన రాబిన్ హుడ్ చిత్రం కూడా శ్రీలీలకి కలిసి రాలేదు. బాలీవుడ్ ఎంట్రీతో ఇప్పుడు నేషనల్ లెవెల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్‌తో కలిసి ఓ చిత్రం చేస్తుండగా, ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం జోరుగా జరుగుతోంది. అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రేమకథా చిత్రం కోసం ఇప్పటికే కొన్ని ఫైర్ లవ్ గ్లింప్స్‌ను విడుదల చేయగా, వాటికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇద్దరి కెమిస్ట్రీపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఇక సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా కూడా అప్పుడప్పుడు సోషల్ మీడియాలో తన అభిమానులతో చిట్ చాట్ చేస్తుంటుంది. ఈ క్రమంతో తాజాగా ఫాలోవర్స్ అడిగిన ఓ పది ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానాలు చెప్పింది. 'ఎలా ఉన్నావ్?' అని ఓ అభిమాని అడిగితే.. ఇలా ఉన్నాను అంటూ ఓ ఫోటోని పోస్ట్ చేసింది శ్రీలీల. 'మీ ఆరోగ్యం జాగ్రత్త' అని మరో ఫ్యాన్ అంటే.. "నాకు సంబంధించిన ప్రతి విషయాన్ని తనే చూసుకుంటుంది" అంటూ తన తల్లితో దిగిన పిక్ ని షేర్ చేసింది. మరో నెటిజన్.. నాకు పరీక్షలు ఉన్నాయి. ఏమైనా టిప్స్ చెబుతావా అని అడగ్గా.. సోషల్ మీడియాకు దూరంగా ఉండు. ఎక్కువసార్లు రివిజన్ చేసుకో., ప్రీవియస్ ఇయర్స్ పేపర్స్ ప్రాక్టీస్ చేసుకో. అలసిపోతే వీడియోలు చూడు, చాట్ జీపీటీ సాయం తీసుకో అని చెప్పుకొచ్చింది. అవి టిప్స్ కాదు, నాకు బాగా ఉపయోగపడ్డాయని శ్రీలీల పేర్కొంది. ఇదే క్రమంలో మరో నెటిజన్ 'నీ ఫేస్ అచ్చం నా వైఫ్ మాదిరిగా ఉంది' అని కామెంట్ చేయగా.. "ఐడియల్ సిచ్యుయేషన్స్ లో నన్ను భార్యగా చేసుకోండి అని నేనంటాను.. అయ్యో, నేను సరదాగా అన్నాను. మీ భార్యకు నా ప్రేమను తెలియజేయండి అని రిప్లై ఇచ్చింది. ఇక స్కిన్ కేర్ టిప్స్ చెప్పమని అడిగితే.. మొటిమలు రావడం ఈ రోజుల్లో సహజం. కాబట్టి మై లవ్లీ యంగ్ లేడీస్ మీరు వాటి గురించి ఏ మాత్రం దిగులు పడొద్దని పేర్కొంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com